# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 35 సంచిక 4
పేజీలు 40
ఫిబ్రవరి 2016

**5సం॥ల చందా రూ. 250**
**2సం॥ల చందా రూ. 120**
**సంవత్సర చందా రూ. 60**
**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

printed and published by
C.V. Ramana Babu
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Samardha Sadguru Publications,
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh and
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
DUGGIRALA JAGANMOHANA
BALA KRISHNA LAL

**ఈ సంచికలో** ................................ ....... **పేజీ**

భద్రవాక్యం ........................................2
శ్రీబాబూజీ ఉవాచ..................................3
అమ్మమాట.............................................................6
బంగారు క్షణాలు ....................................8
పరాప్రకృతి - అపరా ప్రకృతి ...................10
విశ్వాసం ............................................11
ఉపనిషత్కథ .......................................13
హనుమాన్‌చాలీసా ..............................15
యోగవాశిష్ఠము ...................................17
మహాభారత నీతి చంద్రిక.......................19
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు...................21
పరిప్రశ్న ..........................................22
మేలుకో శ్రీరంగనాథా! ......................23
పుణ్యం కొద్దీ పురాణ పురుషుడవైతిరి...........26
శ్రీకృష్ణకర్ణామృతము............................27
ఏడు చేపల కథ ..................................29
గీతాధ్యయనమ్ ..................................31
సాధన చతుష్టయం .............................33
నింద్రకొలను శాఖ సత్సంగ కార్యక్రమాలు 35
మేకపిల్ల - తంగేడు పూలు ...................36
సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర...........37
విష్ణు కథలు- భక్త సూరదాస్.................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

అన్ధం తమః ప్రవిశన్తి యేఽ సమ్భూతి ముపాసతే
తతో భూయ ఇవతే తమః య ఉ సమ్భూత్యాగ్ం రతాః ॥
(ఈశావాస్యోపనిషత్ 12 శ్లో)

'సమ్యక్ పద్యతే అనేన ఇతి సంపద' మానవుని ఉన్నత స్థితికి చేర్చగల్గేది సంపద అన్న విషయం అందరికీ తెలిసినదే. అయితే మానవుడు ఎంతో శ్రమించి ఆర్జించిన సంపద తనతో శాశ్వతంగా వుండి తనని ఉన్నత స్థితికి చేర్చగలిగేది ఏది అన్నది చర్చనీయాంశము. మానవుడు తన జీవిత కాలంలో ఆర్జించిన ధన ధాన్యాదులు, వస్తువులు, ఆస్థులు, కీర్తిప్రతిష్ఠలు, ఉన్నత పదవులన్నీ లౌకిక దృష్టిలో సంపదే కావచ్చు. వాటిని సాధించటానికి తాను తగు ప్రయత్నం చేయటమే కాక యజ్ఞ యాగాదులను నిర్వహిస్తాడు. అంతేకాదు, ఎన్నో పుణ్యక్షేత్రాలను దర్శిస్తాడు. ఎందరో మహాత్ములను దర్శిస్తాడు. వారిని తన గృహానికి ఆహ్వానించి, ఎంతో గౌరవిస్తాడు. ఇంత శ్రమించి ఆర్జించిన లౌకిక సంపదనంతటిని విడిచి, వట్టి చేతులతో మట్టిపాలు కావలసినదే కదా! ఏది తన వెంటరాదు కదా! పోనీ అంతటితో కథ ముగుస్తుందా?

తాను ఆచరించిన కర్మకి బద్ధుడై వేరొక ఉపాధిని ఆశ్రయించి, జన్మకి రాక తప్పదు. ఇటువంటి అజ్ఞానాంధకారం నుండి విముక్తిని పొందాలంటే తన జీవిత కాలంలో లౌకిక సంపదయందు గల వ్యామోహాన్ని త్యజించి, తత్త్వసంపదను ఆర్జించడానికి తగు ప్రయత్నం చేయాలి.

ఆ సంపదను ఆర్జించడానికి తగిన సాధన ఎవరు చేస్తారో వారు ఆర్జించిన సంపద శాశ్వతంగా వారి సొత్తు అవుతుంది. అంతేకాదు వారు ఉన్నత గతిని పొందుతారు. వారికి బంధ విముక్తి తథ్యం. జనన మరణ వలయం నుండి విముక్తి కూడా సాధ్యమే.

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

ఒకనాటి భక్తసమావేశంలో డా॥ ప్రసాదరావుగారు మాట్లాడుతూ "మీ చరిత్ర వ్రాయలని ఉంది" అని శ్రీ బాబూజీ మహరాజ్‌తో చెప్పిన దానిని పురస్కరించుకుని సమాధానం చెబుతూ "తప్పకుండా వ్రాయవచ్చు. చరిత్ర వ్రాయవచ్చు. లీలలూ వ్రాయవచ్చు. అవి రెండూ వేరువేరుగా వ్రాస్తే చాలా బాగుంటుంది. మీరు ఏమి వ్రాస్తారండీ? నాకు ఇంత పొడుగు తోక ఉందని వ్రాస్తారు. అంతే కదా! దాని వలన ఏమి ప్రయోజనం? అంటే నన్ను ప్రపంచంలో పడవేస్తారన్న మాట. ప్రపంచంలో జనం 'ఆహా! ఓహో!' అని అంటారు. అవి మనకెందుకండీ! నా జానెడు పొట్టకు మా అమ్మలోటు చేస్తుందా!



నా రామ పాదుకలు నా కెన్నడూ లోటురానీయలేదే! మూడు లేక ఐదు ముద్దలు తిని నా కడుపు నింపుకుని సాధన చేసుకునేవాణ్ణి. నా చిన్నతనంలో నా కాలికి గండపెండేరము ఉండేది. పండితులంతా దానిని చూసి ఈర్ష్యపడేవాళ్ళు. నన్ను ఆటపట్టించడానికి ప్రయత్నం కూడాచేశారు. అలాచేసిన వారంతా మా అమ్మ దృష్టిలోపడి తగిన మూల్యం చెల్లించారు. నా బాల్యంలో ఏవేవో చాలా పనులు చేశాను. ఎందరికో ఎన్నో ఉపకారాలు చేశాను. వైద్యం చేశాను.

కానీ ఆధ్యాత్మిక చింతనకోసం నన్నాశ్రయించినవారు చాలా తక్కువ. అందరూ వారి కుటుంబ అవసరాలకోసమూ, సంతాన ప్రాప్తికోసమూ, వ్యాపార నిమిత్తమూ లేక ఆరోగ్యస్థితి మెరుగుపడటానికో వచ్చి లబ్ధి పొందినవారే. కొంతమందికి కొన్ని మహత్తులు కూడా చూపించాను. ఎన్ని చేస్తే మాత్రం మానవ స్వభావం మారుతుందా అండీ! మీరే చెప్పండి? మీరు పండితులు, అష్టావధానం చేస్తారు. ఎన్నో గ్రంథాలు చదివారు. వాటిలో ఏ ఒక్కటైనా మీ ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చిందా? అన్యథా భావించకండి. మీ విషయమనేకాదు మానవులెవరైనా అంతే. కుక్కతోక వంకరగా ఉంటుంది కదా!

ఒక డాక్టరుగారు కుక్క తోక వంకరని సవరించడానికి ఒక కర్ర తీసుకువచ్చి ఆ తోకకి గట్టిగా వంకరపోయేలాగా కట్టుకట్టాడు. ఆరునెలల తరువాత ఆ డాక్టరుగారు ఆయన ప్రయత్నం తప్పక సఫలీకృతమౌతుందని ఆశించి కట్టువిప్పారు. కానీ ఆ కుక్కతోక వంకరమాత్రం యథాతథంగానే ఉంది. అలాగే ప్రాపంచిక విషయాదులతో కూడిన మానవుని మనస్సు ఎంత ప్రయత్నించినా మారదు సుమా!

అందుచేతనే మన వేమనగారు చక్కగా సెలవిచ్చారు. బొగ్గును స్వచ్ఛమైన పాలతో లేక నవరసాలతో, లేక సప్తసముద్ర జలాలతో, పవిత్ర నదీ జలాలతో మహన్యాస పూర్వకంగా నమకం, చమకం చదివి ఎంత శుద్ధిచేస్తే మాత్రం ఆ బొగ్గు తెల్లబడుతుందా? అలాగే గుణహీనుడికి ఎంత బోధచేస్తే మాత్రం మారతాడా?

ఇక్కడ మీకొక ఉదంతము చెబుతాను. సుందరరావుగారను మన భక్తుడు ఒకాయన రాజమండ్రిలో జయంతులు అయిన తరువాత నా దగ్గర సెలవుతీసుకుని వెళదామని హడావిడాగా వచ్చాడు. పాపం ఏదో అత్యవసర వ్యవహారాలలో మునిగి ఉన్నాడులే అని వెళ్ళటానికి అనుమతిస్తూ ఆయనకు ఒక యాపిల్‌పండు ఇచ్చాను.

ఆయన హడావిడిలో ఆ పండు తీసుకుని అతని వద్ద ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకున్నాడు. ఆ పండు గురుదేవుడు అనుగ్రహించిన ప్రసాదమనే సంగతి మర్చిపోయాడు. ఆరునెలల అనంతరం ఆయన మళ్ళీ అదే బ్యాగ్‌తో నాదర్శనార్థం వచ్చాడు. పాపం ఆయనకు అప్పుడు బ్యాగులో ఉన్న యాపిల్‌పండును చూసుకునే అవకాశం కలిగింది. నేనిచ్చిన యాపిల్‌పండు ఏ మాత్రం మార్పులేకుండా అలాగే ఉంది. ఆ విషయాన్ని ఆయనే ప్రస్తావించి పండును కూడా నాకు చూపించాడు. నేను ప్రసాదంగా ఇచ్చిన యాపిల్‌పండు ఏమాత్రం మార్పులేకుండా అలానే వుంది. సంతోషం, కానీ మహాత్ములు ఎంత బోధించినా మానవుల స్వభావాలు కూడా మార్పులేకుండా అలాగే ఉంటున్నాయి. దానికి నేను బాధపడటం లేదు కానీ నేను కోరేది ఏమంటే మీలో మార్పుచెందనిది ఒకటి ఉంది. దానిని తెలుసుకుంటే ఇంక తెలుసుకోవలసినది ఏదీ

వుండదు. దానిని తెలుసుకోవడానికి ప్రయత్నించండి. అప్పుడు నేనెవరో మీకు తెలుస్తుంది. ముందుగా మా రమణుడు చెప్పినట్లు అసలు నేనెవరు? అని ప్రశ్న వేసుకోండి అలా ప్రశ్న వేసుకొని విచారణ చేయండి.

నేను దేహమా? లేక నేను ఇంద్రియమునా? నేను మనస్సా? బుద్ధా? చిత్తమా? అహంకారమా? అనిప్రశ్నలు వేసుకొని విచారణ చేయండి. పైన వేసిన ప్రశ్నలన్నిటిలో 'నేను' అన్నది సాక్షిగా ఉంది. అలాగే గాఢనిదురలో నేను అనే భావన ఉందా? పోనీ ప్రపంచము ఉందా? సంకల్పాలున్నాయా? పోనీ ఏదైనా క్రియ ఉందా? కానీ మెలకువ వచ్చేసరికి నేను అనేది ఉద్భవిస్తోంది. మెలకువ రాగానే జగత్తు వుంది. నువ్వు వున్నావు. ఈశ్వరుడూ వున్నాడు. మెలకువలో ఈ భావానికి కారణం నేను అనే అహంకారమే కదా! అది తొలగిపోతే అక్కడ మిగిలేది నేను అనే భావన కాదు అనుభూతి మాత్రమే. భావన లేనప్పుడు రాగద్వేషాలు లేవు. సంకల్పము లేదు వికల్పమూ లేదు.

ఇక్కడ మీరొక విషయము గుర్తించాలి. నేను తింటున్నాను. నేను నడుస్తున్నాను. నేను హాయిగా నిదురపోయాను. అని అంటారు కదా! అక్కడ మీరు చేసే ప్రతి క్రియకి నేను సాక్షిగా ఉంది. సాక్షిగా ఉన్న నేను దేహము అనుకోవడానికి వీలులేదు. ఎందువలన అంటే శరీరము జడము. కాబట్టి దానికి క్రియను నిర్వహించే సత్తాలేదు. ఆత్మవస్తువు రూపనామక్రియా రహితమైనది. ఈ నేను అనేది అహంకార పూరితమైనది. అహంకారము రహితమైతే అక్కడ మిగిలేది 'సో-హం' భావన. ఆ భావనే అనుభూతి అవుతుంది. అదే షట్చక్రాలలో సంచరించే కాంతి లేక తేజస్సు. అదే కుండలినీ శక్తి. అదే గురుతేజస్సు. నేను తింటున్నాను. నేను వింటున్నాను. నేను చూస్తున్నాను. అనే భావనలో తాను కర్తృత్వ భోక్తృత్వాలను ఆపాదించు కుంటున్నాడు కాబట్టి అక్కడ నేను అనేది అహంకారంతో కూడినదై ఉంటుంది. కర్తృత్వ, భోక్తృత్వాలను త్యజించినట్లైతే అక్కడ తానే  సాక్షిగా మిగులుతాడు" అన్నారు శ్రీ బాబూజీ మహరాజ్.

# అమ్మ మాట

- జపమాల ప్రసాద

## బ్రహ్మ లీల

"క్రొత్త సంవత్సరంలో అడుగుపెట్టి అప్పుడే ఒక నెల అయిపోతోంది. 'హ్యాపీ' న్యూ ఇయర్ అని ఒకళ్ళనొకళ్ళు అభినందించుకున్నాం. అసలు సంతోషము, సుఖము, శాంతి, ఆనందము - అన్నీ శ్రీసద్గురు దేవుల నామధేయంలోని 'H' అనే అక్షరంలోనే వున్నాయి. 'హనుమత్ - హ్యాపీ' అదే నిజమైన హ్యాపీనెస్ (ఆనందం). శ్రీగురుదేవులు అఖండచైతన్య స్వరూపులు. ఆ చైతన్యాన్ని ఆశ్రయించినవారికి మరుపు లేదు. అంటే, మనకి మరుపు లేదు. గురుదేవులని విస్మరించనంత వరకూ మనకు ఏ లోటూ లేదు.

ధనుర్మాసం ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా భగవత్తత్త్వ విచారణతో సాగిపోయింది. మనం ఎన్ని పురాణాలు విన్నా, మన మనస్సులు దేనిని వెదుకుతున్నాయి? ఆ కృష్ణ లీలలు వింటున్నా, మనకి స్వయంగా సద్గురుదేవులు ప్రసాదించిన దివ్యానుభూతులే గుర్తుకు వచ్చాయి. ఎవరెన్ని పురాణాలు చెప్పినా, ఎన్ని మనం విన్నా, మన స్వానుభవం ఆనందదాయకం కదా!

'కాళింగుడి' కథ మనం విన్నప్పుడు మనకి పట్టిసీమ గుర్తుకు వచ్చింది. మన భక్తులు చాలామంది గోదావరిలో మునిగిపోతున్నప్పుడు శ్రీస్వామివారు తమ పంచెని విసిరి 'జగజ్జననీ! రక్షించు' అనేసరికి, వారందరూ తెప్ప తేలినట్టు పైకిలేచి రక్షింప బడ్డారు! ఆ ప్రభువు తప్ప వేరే లేదు అని అహర్నిశలు అనుకున్నప్పుడు ఆయనే ఆపదలోనూ, అంత్యసమయంలోనూ మనకు జ్ఞప్తికి వస్తారు. అప్పుడిక మనం దేనికీ భయపడవలసిన పనిలేదు. మనకి రక్షణ, ముక్తి కూడా కరతలామలకము లవుతాయి. అయితే కర్తృత్వ, భోక్తృత్వ భావాలు మానవుడిని బంధిస్తున్నాయి. మన సుఖానికీ, దుఃఖానికీ కారణం బయట లేదు. మనలోనే వుంది. సుఖ దుఃఖాలు రెండూ తాత్కాలికమే. శాశ్వత వస్తువుని ఆశ్రయిస్తే మనకి శాశ్వత సుఖం లభిస్తుంది. భగవత్తత్త్వంలోనే నిజమైన ఆనందం వుంది. ఆ దివ్యత్వం **divinity** (డివినిటీ) మనందరిలోనూ

ప్రకాశిస్తోంది. కనుకనే మనం యీ విధంగా బ్రతికి వున్నాం. ఇదే బ్రహ్మలీల!

ఆ పరబ్రహ్మవస్తువు అండాండాలతోటి, పిండాండాలతోటి ఆడుకుంటుంది. ఆ భగవంతుడు సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వశక్తిమంతుడు అని అంటే మనం నమ్మటం లేదని ఆయన అనేక లీలలు చేసి చూపించాడు. మానవులమైన మన సంగతి అటుంచండి. ఆ నారాయణుని నాభి కమలం నుండి వుద్భవించిన బ్రహ్మదేవుడే ఆయన ఉనికిని శంకించాడు! అందుకని ఆ బ్రహ్మలీల చేసి చూపించాడు మన చిన్ని కృష్ణుడు. గోవులని, గోపబాలురని బ్రహ్మదేవుడు దాచివేస్తే, మన కన్నయ్య తానే అందరి రూపాలనీ దాల్చి, సృష్టికి ప్రతిసృష్టిచేసి ఏడాది పాటు కథ నడిపించాడు!

ఈ లీలని ఆ భగవంతుడెందుకు చూపించాడు? గొప్ప సాధకులకి మాయను క్రమ్మించి దాని నుండి వారెలా బయటపడ్డారో తెలిపితే, మనం జాగ్రత్తమడతామని, ఇట్లాంటి లీలలు చేశాడాయన! అంతటా, అందిరిలోనూ నేనే ఉన్నాననంటే మనం నమ్మంగా! అందుకని ప్రాక్టికల్‌గా చేసి చూపెట్టాడు స్వామి. గోపాలురు, గోవులు, గోపవత్సములు అన్నీ తానే అయిపోయాడు! బ్రహ్మగారు వాపోయారు. నాలుగు తలలతోటీ ఆలోచించాడు. "ఏలా బ్రహ్మపదంబు?" అని అన్నాడు.

కనుక, గుర్తించివారికి గుర్తుతెలుస్తుంది. నిజమైన భక్తుడు ఎల్లప్పుడూ భగవంతుడి వైపే దృష్టి నిలుపుతాడు. శ్రీగురుదేవులు మన నుంచి ఇది ఒక్కటే ఆశిస్తారు. వారు ప్రసాదించిన నామంపై ఎల్లవేళలా మనసు నిలిపి స్మరణ చేసిననాడు మాయ మన దరిదాపులకి కూడా రాలేదు. ఎందుకంటే నామానికీ, నామికీ తేడా లేదు. ఆ మాయకి అధిపతి భగవంతుడు. అందుకే ఆయన భగవద్గీతలో .... దైవీహ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా। మామేవ యే ప్రపద్యంతే। మాయామేతాం తరంతితే ॥ - అని శెలవిచ్చి యున్నారు. కనుక నిరంతరం భగవన్నామమనే అమృతరసంలో మనస్సుని ఊరవేసి ఉంచండి. అప్పుడు మనస్సు భగవద్రూపాన్నే పొందుతుంది. రసతి - భజతి - సోమ్యతోభవతి' అన్నది యదార్థం. నిరంతర భగవన్నామ రసాస్వాదననీ, అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడు గాక!!"

# బంగారు క్షణాలు

(గత సంచిక తరువాయి)

- డా॥ స్వర్ణముఖి

గురువుగారు -

శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనో యద్
వాచోహ వాచం స ఉ ప్రాణస్య ప్రాణః
చక్షుష శ్చక్షురతి ముచ్యధీరాః
ప్రేత్యాస్మా ల్లోకా దమృతా భవన్తి ॥

ఇది కేనోపనిషత్తులోని మంత్రం. ముందు గురువుగారిని శిష్యుడు అడుగుతాడు, 'దేనిచేత మనసు విషయాదులపై ప్రేరేపింపబడుతోంది? దేనిచేత ప్రాణం, తన పని తను చేస్తోంది? దేనివలన యీ జిహ్వేంద్రియం, కన్నులు, చెవులు పనిచేస్తున్నాయి?' అని.

అప్పుడు గురుమూర్తి పై శ్లోకంలో చెబుతాడు 'ఆత్మయొక్క శక్తి చేతనే యీ యింద్రియాలు, ప్రాణము, బుద్ధి, అన్నీ పని చేస్తున్నాయి. ఈ యింద్రియాలను దాటివెడితే, అమరత్వాన్ని పొందుతాడు' అని చెప్పారు.

శ్రీబాబూజీ -

అదే కదమ్మా నేను చెప్పినదీనూ. మీరేమో చక్కగా చదువుకున్న వారు. చక్కగా శ్లోకాలు చెప్పగలరు. నేనేమీ చదువుకోలేదు. నాకు శ్లోకాలు రావు.'శ్లోకం లోకంలో పడితే శోకమేరా! అందుకని నువ్వు శ్లోకం చెప్పకుండా అర్థం చెప్పరా!' అని మా అమ్మ నాకు చెప్పింది.

చెవిలో వినే శక్తిగా, కంట్లో చూసే శక్తిగా, ముక్కులో వాసన చూసే శక్తిగా, నాలుకకి రుచి చూసే శక్తిగా, చర్మానికి స్పర్శ శక్తిగా పనిచేస్తూ మనలోనే వుంది ఆ చైతన్యం. దానినే 'ప్రజ్ఞానం పరబ్రహ్మ' అంటారు. 'అదినేను' అని తెలుసుకుంటాడు జ్ఞాని.

ఒక దీపం వుంది. దాని మీద బోలెడు చిల్లులున్న కుండని బోర్లించాం. అప్పుడెలా కనబడుతుంది? ఒక్కొక్క చిల్లులో నుండి ఒక్కొక్క దీపం వున్నట్లుగా కనబడుతుంది. కానీ అన్ని దీపాలున్నాయా? లోపల ఒక్కటే దీపం వుంది. పోనీ ఆ దీపం తీసేస్తే యీ చిల్లులకేమైనా ప్రకాశం వుందా? లేదు. ఆ జ్యోతి లోపల వుంటేనే యీ కుండకున్న చిల్లులన్నీ ప్రకాశవంతమవుతున్నాయి.

అలాగే మన లోపల ఆత్మజ్యోతి, చైతన్యం వుంటేనే యీ యింద్రియాలు అన్నీ ప్రకాశిస్తాయి. ఈ దేహమే ఘటం. - పంచ జ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు దానికున్న చిల్లులు. ఆ చైతన్యం కాస్త ప్రక్కకు తప్పుకుంటే? తద్దివిట దివిటే! ఏడుకట్ల సవారీయే!

కనుక మీరందరూ కూడా చక్కగా సాధనచేసి మీలోనే వున్న ఆ చైతన్యమును తెలుసుకొందురు గాక! అటువంటి దివ్య జ్ఞానమును మీకు జగన్నాధుడు ప్రసాదించుగాక! అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను, అఖండ ఆయురారోగ్యములను, అఖండ సుఖశాంతులను ప్రసాదించి, గురుపాదుకలు సర్వదా మిమ్ము కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

ఫిబ్రవరి 2016

3 బుధవారం శ్రీగురుదశమి; సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

13. శనివారం నాడు శ్రీ సద్గురు క్షీర శిలామూర్తుల ప్రతిష్టా మొదటి వార్షిక మహోత్సవము జరుగును

22 సోమవారం గురుపూర్ణిమ; సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

మార్చి 2016

4 శుక్రవారం శ్రీగురుదశమి; సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

23 బుధవారం ఫాల్గుణ పౌర్ణమి; హెూలీ సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

వివరములకు : జగదీశ్వర్ సెల్ - 99856 66797

# పరాప్రకృతి - అపరా ప్రకృతి

- పరాశర ప్రసాద్

'నేను' అంటే వ్యావహారికంగా దేహమనే భావించటం సహజం. అహం అనేది దేహమంతా వ్యాపించి వుంటుంది. శరీరంలో ఏదైనా ఒక భాగం విడిపోతే దానిని నేను అని అనము కదా! అది అహం కంటె విడిగా భాసిస్తున్నది కాబట్టి దానిని బాహ్యావభాసనము అనవచ్చు. దీనిని విచారణ చేస్తే అవ్యక్తము పూర్ణమైన చిదాత్మ పరిచ్ఛిన్నముగా భావించటమే కదా!

అదే అవిద్య అంటే. దానినే బాహ్యావభాసనము లేక మూలావిద్య. శక్తి లేక చైతన్యము నిర్వికల్పం కాబట్టి చిచ్ఛక్తిగా పిలవబడుతుంది. వికల్పముతో కూడి వుంటే జడశక్తి అదే ప్రకృతిగా వ్యవహరిస్తుంది. వికల్పము లేని మాయని అవిద్యని ఐక్యం చేసి జడప్రకృతి అంటున్నారు.

ఇదే విషయాన్ని భగవానుడు భగవద్గీతలో చెప్పటం జరిగింది.

భూమిరాపోనలో వాయుః ఖం మనో బుద్ధిరేవచ ।
అహంకారమితీయం మే భిన్నా ప్రకృతిరష్టదా ॥

భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం, మనస్సు, బుద్ధి, అహంకారం అనే ఎనిమిది జడప్రకృతి లేక అపరా ప్రకృతిగా భాసిస్తున్నది. అంతే కాదు సంపూర్ణ జగత్తును ధరించిన జగత్తుకి జీవమైన ప్రకృతియే పరాప్రకృతి.

జీవుడు పరిచ్ఛిన్న చిద్రూపుడు. దేహము, మనస్సు, బుద్ధి, జీవునికి పరిచ్ఛేదాన్ని కలిగిస్తున్నాయి. అందువలన భిన్నత్వం గోచరిస్తోంది. జీవులు అనేకులుగా వివిధ ఉపాధులతో, నామాలతో గోచరిస్తున్నారు. ప్రకృతి అనేది ప్రాణుల కర్మల సంస్కారముల సమిష్టి వ్యవస్థ. సంస్కారం పైకి గోచరించదు కదా! కాబట్టి అదృష్టము. సుఖము, దుఃఖము, మోహము అనేవి మూడూ ప్రకృతి కర్మఫలాలు. ప్రకృతి అవస్థా భేదమే చిత్తముగా వ్యవహరింప బడుతోంది. అది సుషుప్తిలో స్పష్టంగా కనిపిస్తుంది కదా! అక్కడ ప్రకృతి, చిత్తము భిన్నంగా లేవు.

శ్రీసద్గురుదేవులు పై వేదాంత రహస్యాలను ఒక దృష్టాంతంతో వివరించారు. ఒక ఘటం నిండా జలం ఉందనుకుందాము. ఆ నీటిలో సూర్య ప్రతిబింబం గోచరిస్తోంది. ఘటాన్ని పాంచభౌతిక దేహంగాను, ఘటంలోని నీటిని మనస్సుగా భావనచేస్తే, ఘటము, జలము అపరాప్రకృతియై సూర్య ప్రతిబింబము పరాప్రకృతిగా భాసిస్తున్నట్లేకదా! అయితే సూర్య భగవానుడు వీటన్నిటిని ప్రకాశింపజేస్తూ తాను వీటికి విలక్షణుగా ఉన్నాడు కదా! ఆ రహస్యాన్ని గుర్తెరిగినవాడే జ్ఞాని.

# విశ్వాసం

- పాలూరి కాళీప్రసాద్

'విశ్వాసం' అంటే ఎలా ఉంటుందో శ్రీ పరమహంస యోగనంద స్వామి చెప్పిన కథ -

ఒక ఊరిలో ఒక గృహస్థు అతడు చక్కగా సంసారాన్ని చేస్తూ, సాధన కూడా చేసేవాడు. అదే ఊరి బయట ఒస సన్యాసి అన్ని బంధాలు త్యజించి, ఒక చెట్టు క్రింద నివాసం ఉంటూ తపస్సు చేసుకునేవాడు. అలాగే ఒక త్రాగుబోతు ఎప్పుడూ తప్పత్రాగుతూ అందరితో తిట్లు తింటూ అస్పృహంగా జీవించేవాడు.

ఒకసారి నారద మహర్షి ఆ ఊరిగుండా వెళుతూ ఉంటే, ఆ గృహస్థూ, ఆ సన్యాసి ఆయనకు నమస్కరించి, 'స్వామీ! మాకు భగవత్ సాక్షాత్కారం ఎప్పుడు అవుతుందో కొంచెం ఆ నారాయణ స్వామిని అడిగి చెప్పండి' అని ప్రార్థించారు. నారదుడు సంతోషంగా 'అలాగే' అంటూ ముందుకు సాగాడు. ఇంకొంత దూరంలో ఆ తాగుబోతు కూడా నారదుని ఆపి ఇదే ప్రశ్న అడిగాడు. నారదుడు విసుక్కుంటూ 'అలాగేలే' అని వెళ్ళిపోయాడు.

అలా వెళ్ళిన నారదుడు తిన్నగా వైకుంఠానికి చేరి, 'స్వామీ! నన్నిలా ముగ్గురు వ్యక్తులు తమ దర్శనం ఎప్పుడు అవుతుందో కనుక్కొని చెప్పమని ప్రార్థించారు. దయచేసి చెబుతారా?' అని అడిగాడు. అందుకు నారాయణమూర్తి 'తప్పకుండా నారదా! నేను ఇప్పుడే సూదిబెజ్జంలో నుండి ఏనుగును దూర్చటానికి ప్రయత్నిస్తున్నాను. ఆ పని పూర్తికాగానే ఆ ముగ్గురికీ కూడా దర్శనం యిస్తానని చెప్పు' అన్నాడు.

నారదుడు ముందుగా గృహస్థు దగ్గరకు వెళ్ళి విషయం తెలియ జేశాడు. అది వినగానే ఆ గృహస్థు నిరాశగా 'అయితే ఈ జన్మకు నాకు స్వామిని దర్శించే భాగ్యం లేదన్నమాట. నా తలరాత ఇంతేలే స్వామీ!' అని నిట్టూర్చాడు.

నారదుడు సన్యాసిని కూడా కలుసుకుని ఇదే విషయాన్ని తెలియ జేశాడు. అప్పుడా సన్యాసి 'మహర్షీ! ఆ స్వామికి నాకు దర్శనమివ్వటం ఇష్టం లేకపోతే ఆ విషయం నాకు నేరుగా చెప్పాలికాని, ఇదేమి వంక? అసలు సూదిబెజ్జంలో ఏనుగును దూర్చటం సాధ్యమయ్యే పనేనా?

అనవసరంగా ఇన్నాళ్ళూ అన్ని సుఖభోగాలు వదులుకుని నా జీవితాన్ని వ్యర్థం చేసుకున్నాను. ఇక నేను మళ్ళీ ఆ సంసారం స్వీకరించటమే ఉత్తమం' అని అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

నారదుడు 'ఇక నాకు తప్పదురా బాబూ!' అనుకుంటూ ఎలాగో ముక్కు మూసుకుని, దూరం నుంచే ఆ త్రాగుబోతుకి విషయాన్ని తెలియజేశాడు. వెంటనే అతడు సంతోషంగా 'ఆహా! ఆ నారాయణ మూర్తికి నా మీద ఎంతటి కరుణ! భగవంతుడికి సాధ్యం కానిది ఈ జగత్తులో ఏదీ లేదు కదా! ఈపాటికి సూది బెజ్జంలో ఆయన ఏనుగును దూర్చి, నా కోసం బయలుదేరి ఉంటాడు. నేను వెంటనే సిద్ధం కావాలి' అని అక్కడికక్కడే కూర్చుని బాహ్య ప్రపంచాన్ని పూర్తిగా మరచిపోయి, ధ్యానంలో మునిగిపోయాడు. వెంటనే శ్రీమన్నారాయణుడు తన దివ్య మంగళ రూపంతో అతనికి దర్శనమిచ్చి తనలో లీనం చేసుకున్నాడు!

## గుండుగొలను శాఖ ఆవిష్కరణ

సర్వాధిష్ఠాన చైతన్య సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి పరమానుగ్రహముతోను, పూజ్య శ్రీ యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారి దివ్య ఆశీస్సులతోను, స్వస్తిశ్రీ మన్మథనామ సంవత్సరము మాఘబహుళ నవమి, తత్కాల దశమి గురువారం అనగా ది.3.3.2016 ఉదయం 7.22 గం.లకు గుండుగొలను శాఖలో శ్రీ సద్గురుదేవుల దివ్య చిత్ర పటము చర ప్రతిష్ఠ చేయుటకు నిర్ణయించడమైనది. 3.3.2016 మరియు 4.3..2016 తేదీలలో సత్సంగము, సద్గురుదేవుల పాదపూజ, భక్త సమారాధన ఏర్పాటు చేయడమైనది. భక్త మహాశయులందరూ ఈ కార్యక్రమములో పాల్గొన వలసినదిగా ప్రార్థిస్తున్నాము.

*వివరములకు: 9346535357, 9849134442*

*శ్రీ హనుమత్కాళీ వరప్రసాద బాబు భక్త సమాజ్,*
*గుండుగొలను*

# ఉపనిషత్కథ

- రమణ ప్రసాద్

(చాంద్యోగపనిషత్ నుండి)



ఎన్నో ఏళ్ళ క్రిందట భారత దేశంలో జనశృతి అనే రాజు ఉండేవాడు. ఆయన ప్రజలందరికీ ఆప్తుడు. ఆయన మహావృషభం అనే రాజ్యాన్ని ఎంతో ప్రజారంజకంగా పరిపాలించేవాడు. ప్రజల సౌకర్యం కోసం ఆయన రహదారులలో విశ్రాంతి భవనాలను కట్టించాడు. ఆర్తులకు, పేదలకు ఉచితంగా అన్న పానాదులను సమకూర్చేవాడు. వృద్ధులకు, అనారోగ్యంతో బాధుడుతున్నవారికి ఉచిత వైద్య సదుపాయాలను అందించటంకోసం వైద్యశాలలను కట్టించాడు. ఏనాడూ ప్రజలపై మోయలేని శిస్తు భారం మోపలేదు. ఆ రాజు తను రాజ్యాన్ని ఎంతో ఆదర్శవంతంగా పాలిస్తున్నానని అనుకోవటం సహజమే కదా!

కాని ఆ తృప్తి ఆయనకు ఎంతోకాలం నిలవలేదు. ఒకనాటి సాయంత్రం ఆయన భవనంలో ఆరుబయట విశ్రాంతి తీసుకుంటున్నాడు.ఆ సమయంలో రెండు హంసలు ఆకాశంలో ఎగురుతూ ఆ వైపుకి వచ్చాయి. ఒక హంస ఈ విధంగా అంది,"మనం ఇప్పుడు జనశృతి రాజు పైన ఎగురుతున్నాం. ఆయన కీర్తి ప్రతిష్టలు నిన్ను కాల్చి బూడిద చేస్తాయి, జాగ్రత్త సుమా ! "అన్నది. రెండవ హంస " నువ్వు హాస్యానికి అంటున్నావు. ఆయన ఏమైనా బండి నడిపే రైక్వుడి కంటే ఎక్కువా?" అన్నది.

ఆ రాజుకు పక్షుల భాష తెలుసు. ఆయన వాటి సంభాషణను విని ఆలోచనలో పడ్డాడు. ఆయన, "ఎవరీ రైక్వుడు.? ఆయన నా కంటె ఎలా గొప్పవాడు?"అని అనుకున్నాడు. మనస్సులో ఏదో అశాంతి. ఆయనకు ఆ రాత్రి నిద్ర పట్టలేదు.

ఆ మర్నాడు యధావిధిగా వందిమాగధులు పొగుడుతూ నిద్ర లేపగా రాజు కోపంతో, " ఆపండి మీ పొగడ్తలు! వీటికి నేను తగను" అన్నాడు. "ఏమైంది మహరాజా?" అని అడిగారు ఆ సేవకులు. రాజు తాను విన్న హంసల సంభాషణను వివరించాడు. సేవకులతో," మీరు

వెంటనే వెళ్లి ఆ రైక్వుడి జాడ తెలుసుకోండి. అతడు జ్ఞాని. అతనికి సాటి అయిన వారు ఎవ్వరూ లేరు" అన్నాడు. సేవకులు అతని గురించి ఎన్నో రోజులు వెతికారు. చివరకు అతడు ఒక గ్రామంలో ఉన్నాడని, బండి తోలటం అతని వృత్తి అని తెలుసుకున్నారు. అతని వద్దకు వెళ్ళి, "మా రాజు మిమ్మల్ని చూడాలనుకుంటున్నాడు" అన్నారు. అలాగా! అయితే మీ రాజునే ఇక్కడకు వచ్చి కలవమని చెప్పండి" అన్నాడు. సేవకులు ఆశ్చర్యపోయారు. రాజుగారు ఇతడిని ఎందుకు చూడాలనుకుంటున్నారో వారికి అంతు పట్టలేదు. వారు వెళ్ళి రాజుకి రైక్వుడి వివరాలు అందించారు. రాజు ఎంతో సంతోషించి పరివారంతో కూడి రైక్వుడున్న చోటికి వెళ్ళాడు. అతనికి బహుమతిగా ఇవ్వటానికి 600 ఆవులను, ఎంతో విలువ గల బంగారు కంఠాభరణాన్ని తీసుకువెళ్ళాడు.

రైక్వునితో, "నువ్వు ఎంతో దయాశాలివని, బ్రహ్మ జ్ఞాన సంపన్నుడవని" విన్నాను. నాకు మీరు బ్రహ్మ జ్ఞానాన్ని బోధించండి.. మీకు ఏం కావాలంటే అది ఇస్తాను" అన్నాడు రాజు. రైక్వుడు నవ్వి " నువ్వు బ్రహ్మ జ్ఞానాన్ని కొందామని అకుంటున్నావా? వెర్రివాడా! అది కొనబడేది కాదు. నువ్వు బ్రహ్మ జ్ఞానాన్ని పొందటానికి అర్హుడవు కాలేదు. వెళ్ళు" అన్నాడు. చేసేది లేక రాజు తన రాజ్యానికి తిరిగి వచ్చాడు. నాకు ఏమి తక్కువ? అని విచారించసాగాడు. అలా విచారణ చేయగా అతనిలోని అహం భావం పోయింది. అతనిలో ఎంతో మార్పు వచ్చింది. బ్రహ్మ జ్ఞానాన్ని పొందాలనే తపన అతనిలో అధికమైంది.తిరిగి రైక్వుని వద్దకు వెళ్ళాడు. రైక్వుని పాదాలపై వ్రాలి తనకు జ్ఞానాన్ని బోధించమని అర్థించాడు. " నాకు తరించే మార్గాన్ని బోధించండి" అని వేడుకున్నాడు.

రైక్వుడు అతనిలో కలిగిన మార్పును గ్రహించాడు. అతడు బ్రహ్మ జ్ఞానం పొందటానికి అర్హుడైయ్యాడు అని తెలుసుకున్నాడు. అతనిని ఆప్యాయంగా లేవదీసి, ఓ జనశృతీ! నీవు జ్ఞానవంతుడవు అవుదువు గాక!" అని దీవించాడు." రాజా! అహంభావం పూర్తిగా పోనిదే బ్రహ్మ జ్ఞానాన్ని పొందే అర్హతను సంపాదించలేవు. అణకువ కలవాడే దానికి అధికారి. నీలో అహంభావం పోయింది కాబట్టి నీకు బ్రహ్మ జ్ఞానాన్ని ఉపదేశిస్తున్నాను" అని అతనిని తన శిష్యునిగా చేసుకొని అతనికి జ్ఞానోపదేశం చేశాడు.

# హనుమాన్ చాలీసా

- కొంపెల్ల రామకృష్ణ

పురాణాలు, శాస్త్రాలు తెలియనివారు ఉండవచ్చు, కానీ హనుమాన్ చాలీసా అంటే తెలియని వారుండరు. చాలీసా అంటే 40 అని అర్థం. దోహా మరియు చోపాయీ అనేవి హిందీ ఛందస్సులో రెండు ప్రక్రియలు. కబీర్ దోహాలు మనకు తెలిసినవే. గోస్వామి తులసీదాసు హనుమాన్ చాలీసాను 40 చోపాయీలు, రెండు దోహాలు మొదట్లో ఒకటి, చివర మరొకటి ఉంచి వ్రాశారు.40అంటే మండలం అని అర్థం. ఇది చాలా ప్రసశస్థమైన సంఖ్య. ఇందులో నుండే మనకు మండలదీక్ష అనే ఆచారం వచ్చింది.



దోహా 1

శ్రీగురుచరణ సరోజ రజ । నిజమన ముకుర సుధారి ।
బుద్ధిహీన తను జానికై । సుమిరౌ పవన కుమార్ ।
బలబుద్ధి విద్యా దేహుముహి । హరౌ కలేశ వికార్ ॥

గురువు యొక్క పాదపద్మము యొక్క ధూళితో నా మనస్సు అనే అద్దమును శుభ్రపరుచుకుంటాను. దీని అర్థం ఏమిటంటే, భగవంతుణ్ణి ప్రార్థించే ముందు చిత్త శుద్ధి కావాలి. అది రావాలంటే గురువు యొక్క కృప కావాలి. అందువల్ల మొదటగా గురువును ఆశ్రయించాలి. తులసీదాస్‌గారి గురువు నరహరిఆనంద స్వామి. కనక మొదటగా ఆయనని ప్రార్థన చేశారు.

హనుమంతుడు శివ స్వరూపము. అంటే సాక్షాత్ గురు స్వరుపమే. కనుక మనం హనుమంతుడిని గురువుగా భావించి, ఆయన అనుగ్రహం కోసం ప్రార్థన చేసినట్లుగా కూడా భావించవచ్చు.

ఇక్కడ తులసీదాసు గురుపాదపద్మముల యొక్క విశిష్ఠత ఎంతో చక్కగా విశదీకరించారు. మన మనస్సు మలినం అయితే భగవంతుని

దర్శనం అవదు. అందుకని పద్మముల వంటి గురువు యొక్క పాదధూళితో మనస్సును శుద్ధి చెయ్యాలి. ఆ ధూళినే పద్మములో ఉండే పుప్పొడితో పోల్చారు. అది ఎంతో పవిత్రమైనది అంటే గురుకృప లేనిదే భగవంతుని పొందలేము.

'అలా శుద్ధమైన మనస్సుతో నిర్మలమైన శ్రీరామచంద్రమూర్తి కీర్తిని వర్ణిస్తున్నాను' అంటాడు తులసీదాసు. దానివలన ఏమి కలుగుతుంది అంటే నాలుగు ఫలములు సిద్ధిస్తాయి. అవి ధర్మ అర్థ కామ మోక్షాలనే నాలుగు ఫలములు.

దోహా 2

అజ్ఞానము కలిగినది యీ దేహం అని తెలుసుకుని, దానిని పోగొట్టుకునేందుకు పవన కుమారుడు అయిన హనుమంతుని స్మరిస్తున్నాను. అంటే యీ దేహాత్మ భ్రాంతిని, నేను, నాది అనే వలయం నుండి మోక్షాన్ని పొందటానికి సాక్షాత్ శివ స్వరూపం, గురు స్వరూపం అయిన హనుమంతుని ప్రార్థిస్తున్నాను. అజ్ఞానం వలన కర్మచేస్తాము. దాని వలన మనకు మరల దేహం వస్తుంది. ఈ వలయం నుండి మోక్షం పొందటానికి గురుచరణములు ఆశ్రయించి అజ్ఞానం నుండి విముక్తిని పొంది మోక్షసిద్ధిని పొందుతాను.

అలా హనుమను స్మరిస్తే ఏమి యిస్తాడయ్యా అంటే బలము బుద్ధి విద్య యిస్తాడు. వీటితో మనకు ఏమి లభిస్తుందంటే క్లేశములను హరింపజేస్తాడు. అంటే యీ శరీరము అజ్ఞానము వలన వచ్చిందని బాధపడటం మాని, హనుమంతుని స్మరించి మన క్లేశములను నాశనం చేసుకుని మోక్షప్రాప్తిని పొందాలి. అంటే బలమైన శరీరము, బలమైన మనస్సు, జ్ఞానము, విద్య యిచ్చి, అజ్ఞానం, అహంకారం, మమకారం, రాగద్వేషములను, దురభిమానం, గర్వము మొదలైన క్లేశమునులను వికారములును పోగొడుతుంది.

వరణౌ రఘువర విమల యశ। జో దాయక ఫలచారి ॥

- సశేషం

# యోగవాశిష్ఠము

- సుషుమ్నా ప్రసాద

మోహమనేది వొక అనూహ్యమైన, అద్భుతమైన చక్రములాంటిది, వివేచనా శక్తి, జ్ఞానమనే ఆయుధాలతో, మనసును నిర్మూలించవచ్చు. అప్పుడు నీవు మాయ చేత యేలాంటి యిక్కట్లకు లోనుకావు. కనుక నీవు మరల పర్వత గుహలోకి వెళ్ళి, కఠినమైన తపస్సు, ధ్యానము పది సంవత్సరములు చేయవలసినది. ఆ వ్యవధి పూర్తికాగానే, నీవు బ్రహ్మమును గురించి, పరిపూర్ణమైన, విష్కళంకమైన బ్రహ్మ జ్ఞానమును సాధిస్తావు. అలా గాధికి ప్రబోధంచేసి, శ్రీమహావిష్ణువు అదృశ్యమైనారు.



"శ్రీహరి అదేశానుసారము గాధి దశవర్షములు ఘోరతపస్సాచరించాడు, అప్పడతనిలో ఆశలు, కోరికలు, అనుబంధాలు, మాయా ప్రభావము, అన్ని అంతరించి పోయి, ఆత్మ జ్ఞానమును పొందాడు. అప్పుడు భయము, బాధలు, విషయ సుఖాలకై వెంపరలాడే ఆరాటమన్నీ అంతరించి, నిత్యానందమనే అత్యున్నతమైన స్థితిని చేరుకొని, స్వేచ్ఛా తపస్వి లేక జీవన్ముక్తుడుగా రూపొందాడు.

## ఉద్దాలకుని కథ

వశిష్ఠ మహర్షి శ్రీరామచంద్రునితో యిలా అన్నాడు. "ఓ రామా! ఉద్ధాలక మునిలా పంచభూతాలను జయించి, దేహము, ప్రపంచమును గురించిన ఆలోచనలను విసర్జించి, ఆత్మ విచారణను ప్రారంభించి, అన్నిటికి మూలకారణమైన దానిలో గాఢంగా చొచ్చుకొనిపోయి, దివ్య జ్యోతిని నీ మనసుపై ప్రసరించేట్లు చేసుకో".

అప్పుడు శ్రీరామచంద్రుడు వశిష్ఠ మహర్షినిలా ప్రశ్నించాడు "పూజ్యులైన గురుదేవా! ఉద్ధాలక మహర్షి యెలా పంచభూతాలను జయించి, అద్వైత స్థితిని చేరుకొన్నాడు?"

వశిష్ఠ ముని యిలా సమాధానం చెప్పాడు, "ఓ రామా! నీకిప్పడు వుత్తేజ పూరితంగా, ఆసక్తికరంగా వుండే యదార్థ కథను చెప్తాను. ఉద్దాలక ముని, ఆత్మ విచారణ ద్వారా, అద్భుత తేజస్సుతో విరాజిల్లే లోపరహితమైన బ్రహ్మత్వ స్థితిని పొందాడు. ఆ ఋషి ప్రకృతి రమణీయతతో నలరించిన గంధమాదన పర్వత లోయలలో నివసించేవాడు, ఆయన ఘోరమైన తపస్సు చేశాడు, ఎన్నో వేదాంత గ్రంథములను అధ్యయనముచేశాడు. నిత్యనైమిత్తిక కర్మలను, విశ్వాసము, భక్తితో శ్రద్ధగా నిర్వర్తించేవాడు, అతని మనసులో వివేచనా శక్తివుదయించింది, తనలో తను యీ విధంగా, ఆత్మ విచారణ ప్రారంభించాడు.

" ఈ జనన, మరణములనే సుడిగుండము నుండి, యెప్పడు విముక్తుడనవుతాను? ఎప్పడు నేను సంకల్పరహితుడనై, ఆకర్షణ, ఏవగింపుల కతీతముగా వుండగలను? ఎప్పడు నేను పవిత్రమైన నిర్వికల్ప సమాధిలో ఆనందిస్తూ స్వస్వరూప స్థితిలో, ప్రశాంతంగా వుండగలను? ఎప్పడు నేను కోరికల నుండి సంపూర్తిగా విముక్తుడను కాగలను? విషయ వాసనలపై వ్యామోహమెప్పడు నశిస్తుంది? ఎప్పడు నేను తామరాకుపై నీటి బిందువులా, విలక్షణంగా వుండగలను? ఎప్పడు నేను తీవ్ర ధ్యాన స్థితిలో వుండగా, అరణ్యములోని చిన్న పక్షులు గడ్డితో జడలు గట్టిన నా శిరోజాల్లో, యెన్నడు గూళ్ళు కట్టుకోగలవు"అని.

ఉద్ధాలకుడు పద్మాసనములో కూర్చొండి, పరమాత్మపై మనసు నిలపుటకు ధ్యానము చేయటం ప్రారంభించాడు. కాని, అతను తన మనసును నిగ్రహించుకో లేకపోయాడు, అది కోతిలా వొక వస్తువు నుండి మరొక వస్తువుపై చలించటము ప్రారంభించింది. అతను దృష్టి కేంద్రీకరించి, మనసును సమాధాన పరచటం ప్రారంభించాడు "ఓ మూర్ఖమైన మనసా! ఎందుకు నీవు నశించే వస్తువులపై పరుగిడుతున్నావు? వాటి నుండి నీవు, కించిత్తైనా, ఆనందాన్ని పొందలేవు. నీ వెందుకు స్వార్థపూరితమైన పనులు చేస్తావు, ఈ క్రియలు బాధ కలిగించినా, నీవు ప్రశాంతంగా, పరమాత్మ యందే నిలకడగా వుండాలి, అప్పడు నీవు నిత్యానంద సుధను గ్రోలుతావు.

- సశేషం

# శ్రీ మహాభారత నీతి చంద్రిక

(గత సంచిక తరువాయి) **మాతృదేవో భవ** - శ్రీ రామానుజ దాసు

గరుడుడు ఆకాశమార్గాన ఎగురుతూ తండ్రి కశ్యప ప్రజాపతిని చూసి తల్లి దాస్య విముక్తికై అమృతం తేవడానికి వెళ్తున్నానని, ఆకలి తీరలేదని, ఏదైనా ఆహారాన్ని అనుగ్రహించమని కోరాడు. కశ్యపుడు పూర్వజన్మలో సోదరులుగా ఉండి వైరభావంతో ఒకరినొకరు శాపాలు యిచ్చుకుని గజ, కచ్ఛపములుగా మారిన వారిని ఆహారంగా తీసుకోమన్నాడు. గరుడుడు గజమును ఒక పాదంతో, కచ్ఛపము (తాబేలును)ను ఒక పాదంతో పట్టుకుని తినడానికి అనువైన ప్రదేశం కోసం చూస్తున్నాడు. రోహిణము అనేపేరు కలిగిన వృక్షం తనపై నిలిచి గజ, కచ్ఛపములను భక్షించమని కోరింది.

గరుడు ఆ వృక్షంపై పాదాలు మోపగానే ఒక కొమ్మ ఫెళఫెళ మంటూ విరిగింది. విరిగిన కొమ్మవైపు దృష్టి సారించాడు గరుడుడు. అయ్యో! గొప్ప ఉపద్రవం సంభవించింది కదా! ఈ కొమ్మను ఆధారంగా చేసుకుని వాలఖిల్యులనే మునులు తపస్సు చేస్తున్నారే! ఇప్పుడు యీ కొమ్మ క్రిందపడితే మునులకు బాధ కలుగుతుంది కదా! అని ఆలోచించి ఆ కొమ్మను ముక్కున కరచుకున్నాడు. ఒక పాదంతో గజం, రెండో పాదంతో కచ్ఛపం, ముక్కున వృక్షశాఖితో ఆకాశంలో ఎగురుతూ నిలవడానికి వీలయిన చోటు కానలేక తండ్రి కశ్యపుడిని ఆశ్రయించాడు.

కశ్యపుడు వృక్షశాఖను ఆధారంగా చేసుకుని తపస్సు చేస్తున్న వాలఖిల్యులకు నమస్కరించి, 'ఈ గరుడుడు మాతృదాస్య విముక్తికై అమృతం తేవడానికై వెడుతున్నాడు. మీకు బాధ కలుగుతుందనియీ శాఖను విడువడం లేదు. మీరు అనుగ్రహించి వేరే చోటును ఆశ్రయించండి' అని ప్రార్థింపగా ఆ మునులు శాఖను విడిచి హిమవత్పర్వతానికి వెళ్ళారు.

బ్రాహ్మణులు లేని ప్రాంతం ఎక్కడున్నదని కశ్యపుని అడిగి తెలుసుకుని గరుడుడు నిష్టురుషం అనే పర్వతానికి వెళ్ళి వృక్ష శాఖని విడిచి, గజ కచ్ఛపాలను ఆహారంగా స్వీకరించాడు. ఇదంతా జరిగినతరువాత దేవేంద్రునికి కొన్ని దుశ్శకునాలు కనిపించాయి.

దేవగురువు బృహస్పతిని కారణం అడుగగా గరుడుడు అమృతం కోసం రావటమే దీనికి కారణం అని చెప్పాడు. అది విని దేవేంద్రుడు అమృతం రక్షించేవారందరికీ హెచ్చరిక చేశాడు. ప్రయత్నపూర్వకంగా అమృతాన్ని కాపాడాలి అని ఆదేశించాడు.

అమృత రక్షకులు భీకరమైన ఆయుధాలతో సిద్ధమయ్యారు. గరుడుడు ఎగురుతూ అమృతం దగ్గరకు సమీపించాడు. దేవతాశ్రేష్ఠులు గరుత్మంతుడితో యుద్ధానికి దిగారు. వారందరినీ ఓడించి, యంత్ర రూపమై, జ్వాలలతో కూడిన చక్రం ఆకుల నడుమ సూక్ష్మ రూపమును ధరించి అమృతాన్ని తీసుకున్నాడు. రుచి చూడకుండా అనాసక్తుడైన గరుడుడిని చూసి విష్ణువు వరమును కోరుకోమన్నాడు. 'మిక్కిలి భక్తితో మీ సేవకుడిగా ఉండే భాగ్యం కల్పించ'మని కోరాడు గరుడుడు.

విష్ణువు గరుడునికి తన వాహనంగా, తన ధ్వజముగా వుండే వరాన్ని ప్రసాదించాడు. ఆకాశంలో ఎగురుతున్న గరుడునిపై వజ్రాయుధ ప్రయోగం చేశాడు దేవేంద్రుడు. వజ్రాయుధం దధీచి అనే మహాముని వెన్నుముకచే చేయబడటం వల్ల అవమానింప తగదని భావించిన గరుడుడు ప్రతిగా ఒక ఈక ముక్కను మాత్రమే త్రుంచివేయమని పలికి ఈక మాత్రమే రాల్చి సుపర్ణుడని కీర్తింపబడ్డాడు.

- సశేషం

## శ్రద్ధాంజలి

**శ్రీబాబూజీ చిరకాల భక్తులు, తెనాలి వాస్తవ్యులు అయిన శ్రీమతి చుండూరి పరిపూర్ణమ్మగారు [కీ॥శే॥పార్థసారథి గారి సతీమణి] 23-12-2015 బుధవారం నాడు శ్రీసద్గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 83 సం॥లు శ్రీసద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరుగాక! వీరి బంధు మిత్రులకు, కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాము.**

## శ్రద్ధాంజలి

**శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు అయిన శ్రీమతి గాదిరాజు సీతాయమ్మగారు [బాతులరాజుగారి భార్య] 16-1-2016 శనివారం నాడు శ్రీసద్గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 84 సం॥లు. శ్రీసద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరుగాక! వీరి బంధు మిత్రులకు, కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాము.**

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

ఫిబ్రవరి 2016

3 బుధ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

7 ఆది : మాసశివరాత్రి, పావులూరు బ్రాంచిలో ఏకాహం

8 సోమ : అమావాస్య

14 ఆది : రథసప్తమి

18 గురు : భీష్మఏకాదశి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

22 సోమ : గురుపూర్ణిమ, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన

మార్చి 2016

4 శుక్ర : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

7 సోమ : మహాశివరాత్రి, తె.జా 3-30ని॥లకు శ్రీబాబుకు అభిషేకం; 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ; ఉదయం 8గం.లకు శ్రీరామలింగేశ్వర స్వామికి సామూహిక ఏకాదశరుద్రాభిషేకాలు; 11గం.లకు పంచామృతాలు, నవరసాలు, సహస్రఘటాభిషేకం, లక్షబిల్వార్చన; అనంతరం భక్తసమారాధన; రాత్రి 7గం. శ్రీఉమారామలింగేశ్వర లీలా సామూహిక కళ్యాణమహోత్సవం; అనంతరం స్వామినగరోత్సవం.

9 బుధ : అమావాస్య, సూర్యగ్రహణం

11 శుక్ర : లలితానంద సరస్వతి ఆరాధన; శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం

23 బుధ : ఫాల్గుణ పూర్ణిమ, హెూలీ పండుగ; శ్రీసద్గురుపాదపూజ

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

'జీవ బ్రహ్మ ఐక్యత ఎలా సాధ్యపడుతుంది. ఒకే స్వరూపం కలిగి వుంటేనేగా ఐక్యత సాధ్యం' అన్న ప్రశ్నకు సమాధానంగా శ్రీగురుదేవులు "సందేహాలు కలగటానికి కారణం పరోక్షజ్ఞానం. అపరోక్షజ్ఞానం సిద్ధించేవరకు సందేహాలు తప్పవు. ముందుగా భగవంతుని వునికిని గురువాక్యం ద్వారా విశ్వసించ గల్గుతారు. అంతవరకు బాగానే వుంది. 'బాబుగారు ఎవరు?'



అని వెంటనే ప్రశ్న ఉదయించటానికి కారణం ఏమిటి? అదే పరోక్ష జ్ఞానానికి నిదర్శనం. ముందుగా నేనెవరు? అని ప్రశ్న వేసుకో దానికి సమాధానం లభిస్తే వెంటనే నీ సందేహాలు నివృత్తి అవుతాయి అనేవారు. ఉదాహరణకి నీవు ఒక వ్యక్తిని కలుసుకోవాలి. ఆ వ్యక్తి నీకు అపరిచితుడు. కాని ఆ వ్యక్తి అడ్రసు నీ వద్దనే ఉంది. ఆ వ్యక్తి అడ్రసు ఆధారంగా అన్వేషణ ప్రారంభిస్తావు. అలాగే భగవానుడు సర్వవ్యాపకుడు అని తెలుసుకుంటావు. మరి ఆయనను గుర్తించాలంటే తగిన ప్రయత్నం చేయాలి కదా! సద్గురుమూర్తి ప్రబోధం ద్వారా బ్రహ్మ కారణం ప్రపంచం కార్యం అని ముందుగా తెలుసుకుంటావు. ఆ తరువాత సాధన ద్వారా నీ మనస్సు స్రూక్ష్మగ్రాహ్యం అయిన తరువాత ప్రపంచాన్ని భ్రమగా గుర్తిస్తావు.

అద్దంలో ప్రతిబింబం ఎలాగో ఇదీ అంతేనని గ్రహిస్తావు. అద్దంలో ప్రతిబింబం అద్దంలో అంతర్భాగమే కదా! అంతేకాదు అద్దం ఉంటేనే ప్రతిబింబం గోచరిస్తుంది. సాధనలో పైకి ఎదిగిన కొద్దీ బ్రహ్మము కారణం కాదు. ప్రపంచం కార్యం కాదు అని తెలుసుకో గల్గుతావు. అది ఆరూఢం అయిన స్థితి సాక్షాత్కారము లేక బ్రహ్మ సాక్షాత్కారము.

దేహభావనే మూలాజ్ఞానం. అదే సందేహాలకు హేతువు. మూలాభావాన్ని అర్థం చేసుకోవటమే జ్ఞానం. ఉన్న దానిని వేరొక విధంగా గుర్తించటమే విపరీత జ్ఞానం. గురుబోధా శ్రవణం ద్వారా జ్ఞానం కలుగుతుంది. సందేహాలు తొలగుతాయి. అంతమాత్రం చాలదు. శ్రవణం చేసిన బోధని విచారణ చేయాలి. అది నిదిధ్యాసకి వస్తుంది. ఆ ధ్యాసలో కలిగే అనుభూతి విజ్ఞానం. స్వస్వరూపానుభూతిని పొందటమే అపరోక్షానుభూతి. అదే సాధకులందరి గమ్యం.

# మేలుకో! శ్రీరంగనాథా!

-సేకరణ మురళీ

1. శ్రీరంగనాథా! తూర్పున సూర్యుడుదయించాడు. దట్టమైన చీకటి అంతమైపోయింది. భగవదారాధనకు అనుకూలమైన మంచి ఉదయ వేళలో పువ్వులు పూచి, తేనెను స్రవిస్తున్నాయి. దేవతలు, రాజులు గుంపులుగా సేవార్థులై వచ్చి ఎదురుగా నిలిచివున్నారు. వారి వాహనాలు గజముల,



వాద్యముల ధ్వనులు అంతటా నిండి సముద్రఘోషవలె ఘోషిస్తున్నాయి. కాబట్టి దేవరవారు మేల్కొని, వీరికి సేవనొసగి, కైంకర్యం అంగీకరించ వలసినదిగా ప్రార్థిస్తున్నాము.

2 శ్రీరంగనాథా! మొల్లల దివ్య పరిమళంతో ఉదయపు తూర్పుగాలి వీచుచున్నది. తామరపుష్పములయందు నిదురించు హంస మిథునములు తమ రెక్కలలోని మంచును విదిలిస్తూ నిదుర లేచినవి. మొసలి యొక్క బిలమువంటి నోటికి దగిలి శ్రమపడుచున్న గజేంద్రుని యొక్క విరోధిని నిరసించటానికి శ్రీదేవి వస్త్రాలు కూడా వీడటం తెలియక అతి త్వరగా వచ్చి రక్షించిన దేవరవారు, ఇంద్రియాలు అనే మొసళ్ళ నోట బడి యుండు సంసారులను రక్షించుటకై మేల్కొనుమా! అని ప్రార్థిస్తున్నాము.

3. శ్రీరంగనాథా! సూర్యప్రకాశం అంతటా వ్యాపించింది. నక్షత్ర ప్రకాశం సంకుచితమై చంద్రుని వెలుగు తగ్గినది. చీకటి పోయినది. తోపులలో పోక చెట్లలోని మొగ్గలు వికసింపగా, ఆ వాసనతో గూడిన ఉదయపు గాలి వీస్తున్నది. అత్యంత ప్రకాశవంతమైన సుదర్శనం ధరించుటకు తగిన విశాల హస్తముల గల స్వామీ! మేలుకో!

4. పశువులను, లేగదూడలను మేపటానికై విడుచున్నప్పుడు, జేర్చు నప్పుడు, గొల్లలు ఊదే పిల్లనగ్రోవి ధ్వని, అవి పరుగెత్తేటప్పుడు వాటి

మెడలోని గంటల శబ్దం అంతటా నిండిపోయింది. మధుపానము చేసే తుమ్మెదలు చెదరిపోయాయి. సజ్జన బాధకమగు రావణ సంతతిని నశింప జేసినవాడును, దర్శనీయమగు వింటిని ధరించినవాడు, బ్రహ్మాది దేవగణ నియామకుడును, విశ్వామిత్ర యాగ పరిరక్షణ మొనర్చి అవభృత స్నానం చేయించినవాడు, శత్రునిరసనమందు అధిక బలంగల అయోధ్యాధిపతీ! శ్రీరంగశాయీ! లేచి కటాక్షింపుమా!

5. సర్వస్వామియు, శ్రీ విభీషణాదుల యొక్క కైంకర్యమును అంగీకరిస్తూ శ్రీరంగ స్థలమందు నివశించే అస్మత్స్వామీ! పూదోటలోని పక్షులు మేల్కొని శబ్దం చేస్తున్నాయి. రాత్రి గడిచినది, ఆరాధన సమయం అయింది, సముద్రఘోష అంతట వ్యాపించింది, తుమ్మెదలు ఝుంకారం చేస్తున్నాయి. పలురకాలుగా పుష్పలామికలను మీ పాదార విందాలకు సమర్పించటానికి దేవతలు వచ్చి నిలిచున్నారు. కరుణించి మేలుకొనుమా!

6. శ్రీరంగనాథా! మహద్రథికులగు ద్వాదశాదిత్యులు, ఏకాదశ రుద్రులు, మయూర వాహనుడగు సుబ్రహ్మణ్యుడు మరుద్గణములు, అష్టవసువులు, వారివారి రథములు, గుఱ్ఱములు మొదలగు వాహనములతో, గాన నాట్యములతో, సుబ్రహ్మణ్య సమేతంగా వచ్చిన సేనా సమూహము, మహామేరు పర్వత సమానమగు కోవెల ఎదుట దేవరవారి కటాక్షానికై నిరీక్షిస్తున్నారు. వీరిని అనుగ్రహించుటకై కృప చూపి మేల్కొనుమా!

7. మమ్మేలినవాడగు శ్రీరంగనాథా! దేవరవారి సన్నిధి ద్వారమున ఐరావతంతో దేవేంద్రుడు, సకల దేవతలు, మహాతపోనిష్ఠులగు సనకాది మహర్షులు, మరుద్గణములు, గంధర్వులు, విద్యాధరులు, యక్షులు, క్రిక్కిరిసి, తోసుకుంటూ శ్రీ పాదారవిందాలను సేవించటానికి వ్యామోహం చెంది, భూమ్యాకాశాలు తెలియక నిండియున్నారు. కటాక్షించి మేలుకో!

8. శ్రీ రంగనాథా! నీకు సమర్పించటానికి పరిమళముగల గరిక, మేలైన శంఖము మొదలైన నిధులను గైకొని దేవతలు, కపిలధేనువు, సాధనలన్నీ సిద్ధపరచుకుని, మహర్షులు, మంగళగానము చేయటానికి తుంబురు నారదులు వచ్చియున్నారు. సూర్యుడు అధిక తేజస్సుతో ఉదయించాడు. అంధకారమంతయు నివర్తించినది. దేవరవారు అజ్ఞానమనే చీకటి నిర్మలముగా పోవునట్లుగా కటాక్షింప మేలుకో!

9. శ్రీరంగశాయీ! మేలైన మృదంగము, తాళము, మద్దెల, వీణ, పిల్లన గ్రోవి మొదలగు వానియొక్క నాదమునకు అనుగుణంగా గానం చేయుటానికి సమర్థులగు యక్ష కిన్నెర గరుడ గంధర్వ చారణ సిద్ధాదులును, మహాతపోనిష్ఠులగు మహర్షులను, బహుదేవతలును దేవరవారి శ్రీపాదారవింద సేవయందలి మిక్కిలి అనురక్తితో నిల్చున్నారు. దేవరవారు వారికి సేవ యొసంగుటకై కరుణచే మేలుకొనుమా!

10. ఉభయ కావేరీ మధ్య ప్రదేశమున శయనించి యుండు శ్రీరంగనాథా! తామరలు వికసించినవి. సూర్యుడు ఉదయించాడు. అబలలు స్నానం చేసి, తీరమునకు చేరారు. తొండర డిప్పొడియను దాసుని యందు స్నేహభావంతో కృపయుంచి, దేవరవారి దాసవర్గమునకు దాసునిగా చేయటానికి కటాక్షించి మేలుకొనుమా!

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

ఫిబ్రవరి 2016

3 బుధవారం శ్రీగురుదశమి; రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ

14 -18వరకు శ్రీసద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠ ద్వాదశవార్షికోత్సవాలు, సత్సంగం, కుంభాభిషేకం.

22 సోమవారం గురుపూర్ణిమ ఉదయం 11గం.లకు శ్రీసద్గురు పాదపూజ.

మార్చి 2016

4 శుక్రవారం శ్రీగురుదశమి; రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ

# పుణ్యం కొద్దీ పురాణ పురుషుడవైతిరి

- పెనుమాక నాగేశ్వరరావు

పుణ్యం కొద్దీ పురాణ పురుషడవైతిరి కొన్నేళ్ళూ
అమ్మగ వచ్చీ తుడిచిరి మళ్ళీ మా కన్నీళ్ళు
బాబుగ బాగుగ చూసిన మీరూ
అమ్మగ వచ్చి అక్కున చేర్చుకున్నారూ ॥పుణ్యం॥

మంత్రం వేశారు, మంత్రముగ్ధుల చేశారు
తీర్థం పోశారు, తీరునె మార్చేశారు
అర్థం తెలిపారు, బ్రతుకుకు అర్థం తెలిపారు
నడవడి నేర్పారు, ఒరవడి కూర్చారు ॥పుణ్యం॥

మనుగడ చూపారు, మనిషిగ చేశారు
మంచిగ పెంచారు, మంచిని పెంచారు
దారులు చూపారూ, ధార్మిక దారులు చూపారూ
కోరినవిచ్చారు, కోర్కెలు తీర్చారు ॥పుణ్యం॥



# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

100 శ్లో॥ మన్దార మూలే మదనాభిరామం
బిమ్బాధరా పూరిత వేణునాదమ్
గో గోప గోపీజన మధ్య సంస్థం
గోపం భజే గోకుల పూర్ణ చన్ద్రమ్

తాత్పర్యము -



కల్ప వృక్షము పాదునందు, మన్మధుని వలె అందమైన వాడును, దొండపండు వంటి పెదవితో పూరించబడిన వేణువు మ్రోతగలవాడును, గోవులును, గోపాలకులు, గోపికల నడుమ నుండు గోపరూపుడైన కృష్ణునికి నమస్కరిస్తున్నాను.

సురభి మా అమ్మాయి. తను, తోటి పిల్లలు తెలివైనవాళ్ళు. కనుకనే పసివయసులోనే పరమాద్భుతమైన లీలలు చేసిన నందబాలుని పరమాత్మగా గ్రహించగలిగారు. మా తోటివారు నంద గోపాలుని కొంటెవాడు, తుంటరివాడు అని చాడీలుచెప్పి నా బుఱ్ఱంతా వేడెక్కించేశారు.

సురభి తన అనుభవాలు అనే చల్లని మాటలతో నా వేడెక్కిన బుఱ్ఱని చల్లబరచింది. ఇరుగు పొరుగు అమ్మలక్కలకు కూడా శృంగ భంగమై తలలు తిరిగాయి. అది ఎలాగంటే, నందనందుని గొప్పదైన మాయా ప్రభావం వలన. నాకు కూడా రెండు అనుభవాలు కలిగాక సురభి మాటల మీద నమ్మకం కలిగింది.

ఒక రోజు ఇంటి కప్పుమీద ప్రాకిన గుమ్మడిపాదు నుండి మా అబ్బాయి కాయలు కోస్తుంటే, చెయ్యి జారి ఒక కాయి దొర్లుకుంటూ క్రిందకు వస్తోంది. అది పడేచోట సరిగా నేను ఉన్నాను. కాని అదే సమయంలో ఒక పసిబిడ్డ పాకుతూ వస్తుంటే వాడిని తప్పించటానికి నేను ప్రక్కకి జరిగాను. వాడికి, నాకూ కూడా ప్రమాదం తప్పింది. ఆ పిల్లవాడి రూపాన్ని నేను వర్ణించి సురభికి చెబితే వాడు యశోదమ్మ

బిడ్డడులా ఉన్నాడు! అన్నది.

వాడికి ఎక్కడ దిష్టి తగులుతుందో అని వాళ్ల అమ్మ వాడిని బయటకు రానీయదు. అయినా ఇంత దూరం, ఇక్కడిదాకా నడిచే వయస్సు కూడా కాదు వాడిది అన్నది సురభి. ఆ బిడ్డ స్పర్శతో నా మనస్సులో మార్పు వచ్చింది. నిర్మలమైన మనస్సుతో 'సర్వ వ్యాపకుడైన వాడే ఆ పరమాత్మ!' అన్నది సురభి. అది నేను విశ్వసించాను.

కొంతకాలం గడిచాక, నీళ్లకు వెళ్లి బిందె తీయబోయి నీళ్లల్లో మునిగిపోయాను. నాకు తెలివితప్పింది. మళ్లీ తెలివి వచ్చేసరికి గట్టు మీద పడుకోబెట్టి ఉన్నాను. చుట్టుప్రక్కలంతా చూశాను. చిన్నపిల్లలు గోవుల్ని మేపుతూ ఉన్నారు. 'నన్నెవరు పైకి తీశారు?' అని అడిగాను. 'మా కన్నయ్యకు ఇటువంటి సహాయాలు చేయటం అలవాటే' అన్నారు వాళ్ళు. 'మరి వాడేడి?' అని అడిగితే, 'ఇంటికి వెళ్లిపోయాడు' అన్నారు వాళ్ళు. ఆపద్బాంధవుడైన వాడిని మరొకసారి చూడాలనిపించింది. కన్నయ్యను చూపించమని సురభిని అడిగాను.

సురభి 'తను బృందావనానికి వచ్చి అక్కడ ఉన్నట్లు గుర్తుగా మురళీ వాయిస్తాడు. అప్పుడు గోపికలు, గోపాలురు, గోవులు అందరూ వెళతారు' అన్నది. ఆ వేణుగానం వినబడగానే నన్ను కూడా తీసుకు వెళతానన్నది సురభి.

ఆ మురళీ పాట ఎప్పుడు వినబడుతుందా! అని ఆవేదన ఎక్కువైంది. తహతహ లాడిపోయాను. ఆ మధుర సమయం వచ్చింది! సురభి నన్ను తీసుకెళ్లింది. అక్కడ ఎదురుగా ముందు కల్పవృక్షం కనిపించింది. దాని మూలలో మన్మధుడిలాగ చాలా అందమైనవాడు. ఎఱ్ఱని పెదవులపై వేణువును ఉంచి, మధురంగా పలికిస్తున్నాడు. గోవులు, గోపాలురు, గోపికల మధ్యలో 'చందమామ' లాటివాడు ఆ నంద గోపాలుడు కనిపించాడు. వాని చిన్ని పాదాలకు నమస్కరించాను. సురభి నాతో ' పరమాత్మ సర్వవ్యాపకుడు, సర్వశక్తిమంతుడు అని నీకు ఋజువైనది కదా!' అన్నది.

# ఏడు చేపల కథ

- ఎమ్. కళ్యాణి
(కాకినాడ)

మనకు ఈ కథయే ప్రథమ కథ. ఆధ్యాత్మికపరంగ కూడా యిదే మొదటి కథ. ఏడు చేపలు ఏడు వ్యసనాలకు ప్రతీకలు. మనిషిని పాడు చేసే వ్యసనాలతో సర్వనాశనం చేసేవి యీ ఏడు వ్యసనాలే!

వెలది జూదము పానవమ్ము వేట పలుకు
ప్రల్లదనమును దండంపు పరు సదనము
సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్మున సేత ......

ఇవి సప్త వ్యసనాలని, వీటి బారిన పడరాదని విదురనీతి.

చేపలు నిరంతరాయంగా కదులుతూనే వుంటాయి. అలాగే వ్యసనపరుడైన వాడు కూడా నిశ్చలంగా వుండలేక నిరంతరం చంచల స్వభావం కలిగి వుంటాడు. అందుకనే వాటిని చేపలతో పోల్చవచ్చు.

సప్తవ్యసనాలు వేటాడాలంటే సంసార సముద్రంలోనే వేటాడాలి. అందుకనే ఆ రాకుమారులు ఆ సముద్రంలో వేటాడి ఏడు చేపలను పట్టుకున్నారు, ఎండబెట్టారు. అందులో ఒకటి ఎండలేదు. అదే మొదటి వ్యసనం 'కామం' అంటే 'కోరిక' అని అర్థం. మనం వ్యసనాన్ని 'త్యజించటం' వేరు, 'జయించటం' వేరు. ఎందుకంటే త్యజించేది మళ్ళీ ఎప్పటికైనా తన దగ్గరకు రావచ్చు. కాని జయిస్తే ఇక మన జోలికి ఎన్నటికి రాదు. అప్పుడే ఆ వ్యసనం ఎండినట్లు లెక్క.

ఇంతకూ మొదటిచేప అనగా కామం ఎండలేదు అంటే 'గడ్డిమేటు' అడ్డమైంది. జ్ఞానకాంతిని అడ్డగించే అజ్ఞానమే గడ్డిమేటు. 'గడ్డిమేటూ ! ఎందుకు అడ్డమయ్యావు?' అని అంటే ఆవు మేయలేదు అన్నది. ఆవు జ్ఞాన స్వరూపిణి. జ్ఞానమే అజ్ఞానాన్ని కబళించాలి. ఆవు ఎందుకు మేయలేదు అంటే పాలేరు మేపలేదంది. జ్ఞానం తనంత తానుగా అజ్ఞానాన్ని కబళించదు. ఎవరైనా ఒక గురువు ఆ జ్ఞానాన్ని అందించాలి. గోవును రక్షించే పాలేరే, జ్ఞానానికి సంరక్షకుడుకిగా నిలిచే గురువు. మరి ఆ గురువు జ్ఞానాన్ని అందించి, అజ్ఞానాన్ని పారద్రోలి కామాన్ని ఎండగట్ట లేదమంటే, అవ్వ బువ్వ పెట్టలేదంటాడు. ఆ అవ్వ అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ. ఆ తల్లి దయలేనిదే ఎవ్వరికీ గురువు లభించడు.

'అవ్వా! బువ్వ ఎందుకు పెట్టలేదు?' అంటే (అమ్మా! జ్ఞానబోధకు

గురువును ఎందుకు ఆదేశించలేదని అడిగితే) 'పిల్లవాడు ఏడుస్తున్నాడు' అంటుంది. ఆ జీవుడు యేవేవో భోగాలు కావాలని ఏడుస్తున్నాడు. వాడికి జ్ఞానాన్ని అందుకునేటంత పరిపక్వత రాలేదంటుంది. 'ఎందుకు ఏడుస్తున్నావురా?' అని అడిగితే 'చీమ కుట్టిందం'టాడు. చీమ అంటే ఆశ. ఆశలలో కూరుకుపోయిన వాడికి జ్ఞానాన్నిబోధించినా అది ఒంట పట్టదు. 'చీమా! చీమా! ఎందుకు కుట్టావు?' అని అడిగితే నా బంగారు పుట్టలో వేలు పెడితే కుట్టనా? అంది. ఆశలు తన దగ్గరకు రావు. తానే కావాలని ఆశల పుట్టలో వేలు పెటతే అది కుట్టకుండా ఎలా వుంటుంది? పైగా అది బంగారంగా భావింపబడుతున్న పుట్ట. ఈ ప్రాపంచిక భోగాలు శాశ్వతమైనవీ, విలువైనవీ కావు. కానీ శాశ్వతమైన వాటిలాగ మనల్ని భ్రమలో ముంచేస్తున్నాయి. కనుక ఆశల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. లేదంటే కామమనే వ్యసనానికి దారితీస్తుంది. కామానికి వశమైపోయిన రావణాసురుడు, కీచకుడు వంటివారి గతి మనకు తెలుసు!

అలాగే రెండవ వ్యసనం జూదం. ఆ వ్యసనాన్ని జయించలేక పోయిన నలమహారాజు, ధర్మరాజు పడిన పాట్లు అందరికీ విదితమే!

మూడవ వ్యసనం మద్యపానం. శుక్రాచార్యుడు చచ్చి (కచుడు సహాయంతో) తిరిగి బ్రతికాడు. కానీ సామాన్య మానవులు మద్యపానం వలన చావటమేకాని తిరిగి బ్రతకరు.

నాల్గవ వ్యసనం వేట. దానివల్ల దశరథుడు, పాండురాజువంటి వారు ప్రాణాలకే ముప్పు తెచ్చుకున్నారు.

ఐదవ వ్యసనం 'పలుకు పల్లదనం' అంటే కఠినంగా మాట్లాడటం. శిశుపాలుడు వాక్పారుష్యం వల్ల ప్రాణం కోల్పోయిన సంగతి విదితమే!

ఆరవ వ్యసనం కఠినదండన. ప్రభువైనవాడు ఎవరైనా అపరాధికి అయిన దానికి కానిదానికి తీవ్రదండన విధించరాదు. దానివల్ల ప్రజాభిమానానికి దూరమవుతాడు.

ఏడవ వ్యసనం వృథా వ్యయం. అంటే దుబారా ఖర్చు. తింటూ కూర్చుంటే కొండలైనా కరిగిపోతాయి!

ఈ విధంగా మన భారతీయ సాంప్రదాయంలో చిన్ననాటి నుంచే చెప్పుకునే కథలో పరమార్థం దాగి ఉన్నది!

(గత సంచిక తరువాయి)

# గీతాధ్యయనమ్

- రమణ ప్రసాద్

## విశ్వరూప సందర్శన యోగం

భగవానుడు తన విభూతులను తెలుపగా, అర్జునుడు వాటినన్నింటిని ప్రత్యక్షంగా వీక్షించే కోరికతో 'యోగీశ్వరా! నాశరహితమైన మీ విశ్వరూపం నాకు చూపు' అని ప్రార్థించగా,



భగవానుడు ....

పశ్యమే పార్థ! రూపాణి। శతశోఽథ సహస్రశః।
నానావిధాని దివ్యాని। నానావర్ణాకృతీని చ ॥ 5

పార్థా! అనేక విధములుగవున్నవి, అలౌకికమై, వివిధ వర్ణములు, ఆకారాములు గలవి అయిన నా రూపమును గాంచుము.

న తు మాం శక్యసే ద్రష్టుం। అనేనైవ స్వచక్షుషా।
దివ్యం దదామి తే చక్షుః। పశ్య మే యోగ మైశ్వరమ్॥ 8

నీ చర్మ చక్షువులతో నన్ను చూడలేవు. నీకు దివ్యదృష్టిని యిస్తున్నాను. నా విశ్వరూపం చూడు అని చెప్పి, శ్రీకృష్ణుడు విశ్వరూపాన్ని చూపించాడు.

అనేక ముఖాలతో, నేత్రాలతో, అద్భుత దృశ్యాలతో, దివ్యాలంకరణలతో, పెక్కు దివ్యాయుధాలతో, పుష్పమాలలతో, దివ్య వస్త్రాలతో, దివ్య గంధాలతో, ఆశ్చర్యకరం, దేదీప్యమానం, అనంతం సర్వతో ముఖం అయి విరాజిల్లింది. ఏకకాలంలో వేయిమంది సూర్యులకాంతి ఆ విశ్వరూపుని తేజస్సుకు సాటిరాదు. అర్జునుడు చేతులు జోడించి, 'దేవా! నీ దేహంలో సకల చరాచర జగత్తును, కమలాసనంలో వున్న బ్రహ్మను, ఋషులను, దివ్య సర్పాలను చూస్తున్నాను. ఎన్నో భుజాలు, ముఖాలు, కడుపులు, కళ్ళు కలిగిన నీ అనంత రూపాన్ని చూస్తున్నాను. తుది మధ్య మొదలు తెలియటం లేదు.

యథా నదీనాం బహవోఽంబువేగాః। సముద్రమేవాభి ముఖాద్రవంతి।
తథా తవామీ నరలోకవీరాః।విశంతి వక్త్రాణ్యభి విజ్వలంతి॥ 28

అనేక నదీ ప్రవాహాలు సముద్రంవైపు వేగంగా పరిగెత్తినట్లు, ఈ నరలోక వీరులంతా నీలో ప్రవేశిస్తున్నారు. దేవా! ఉగ్రరూపంలో వున్న నీ వెవరవో చెప్పు? నీకు నమస్కరిస్తున్నాను.

భగవానుడు -

కాలోఽస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధః। లోకాన్ సమాహర్తు మిహప్రవృత్తః।
ఋతేఽపి త్వాం న భవిష్యంతి సర్వే। యేఽవస్థితాః ప్రత్యనీకేషు యోధాః॥ 32

లోకసంహారానికి వచ్చిన కాలస్వరూపుణ్ణి నేను. ప్రజలను సంహరించమే నా సంకల్పం. నీవు యుద్ధం చేయకపోయినా యీ వీరులంతా మరణించటం ఖాయం. కాబట్టి యుద్ధానికి సిద్ధం కా. నీ శత్రువులందరినీ నేనే చంపేశాను. నీవు నిమిత్తమాత్రుడవు. అర్జునుడు భయంతో ......

కిరీటినం గదినం చక్రహస్తం।ఇచ్ఛామిత్వాం ద్రష్టుమహం తథైవ।
తేనైవ రూపేణ చతుర్భుజేన। సహస్రబాహో! భవవిశ్వమూర్తే! 46

మునుపటిలాగే కిరీటం, గద, చక్రం ధరించిన నీ రూపాన్ని చూపించు. వేయి చేతులుగల విశ్వమూర్తీ! నాలుగు భుజాలతో, పూర్వ రూపంతో సాక్షాత్కరించు.

భగవానుడు "అర్జునా! నా యోగమహిమతో తేజోమయము, సనాతనము అయిన నా విశ్వరూపం చూపించాను. నీవు తప్ప యెవరూ యీ రూపాన్ని చూడలేదు" అని తన శాంత రూపాన్ని ధరించి అర్జునుని ఓదార్చాడు. "పరంతపా! విశ్వరూపుడవైన నన్ను తెలుసుకోవటానికి భక్తితోనే సాధ్యం అవుతుంది.

భగవానుడు -

మత్కర్మకృన్ మత్పరమః। మద్భక్త స్సంగవర్జితః।
నిర్వైర స్సర్వ భూతేషు। య స్సమామేతి పాండవ!॥ 55

అర్జునా! నా కోసమే కర్మలు చేస్తూ, నన్నే పరమగతిగా భావించి, నా మీదే భక్తి కలిగి, దేని మీదా ఆసక్తి లేకుండా సమస్త ప్రాణులపై శత్రు భావం లేనివాడు నన్నే పొందుతాడు.

- సశేషం

# సాధన చతుష్టయం

- రమణ ప్రసాద్

శ్రీబాబు,"గాఢమైన విశ్వాసమే భక్తి. భక్తికి పరాకాష్ఠ జ్ఞానం. జ్ఞానం లభతే ముముక్షత్వం" అని ప్రబోధించేవారు. భక్తి అంటే భగవంతుని పూజించటం, భగవంతుని గుణగణాలను కీర్తించటం. అంతటా భగవంతుడు నిండి ఉన్నాడు అనే అనుభవం రావాలంటే సాధకుడు సాధన చతుష్ఠయాన్ని సాధించాలి. దానిని గురించి తెలుసుకుందాం.

సాధన చతుష్ఠయం కిం? సాధన చతుష్టయం అనగా నేమి?

1. నిత్యానిత్య వివేకః।      (నిత్యానిత్య వివేకము)

2. ఇహాముత్రారథఫలభోగ విరాగః। (ఇహాముత్రఫలభోగవిరాగము)

3. శమదమాదిషట్క సంపత్తిః। (శమదమాది షట్క సంపత్తి)

4. ముముక్షత్వం చ ఇతి।        (ముముక్షుత్వం)

1. నిత్యానిత్య వివేకః కః ?    (నిత్యానిత్య వివేకమన నేమి?)

నిత్యవస్త్వేకం బ్రహ్మ తద్వ్యతిరిక్తం సర్వం అనిత్యమ్।

అయమేవ నిత్యానిత్యవస్తు వివేకః।

(బ్రహ్మము నిత్యము, త్రికాలాబాధ్యము, దేశ కాల వస్తు పరిచ్ఛేదము లేనిది. తదితరము అనిత్యము.)

2. విరాగః కః ?      (విరాగమననేమి?)

ఇహ స్వర్గభోగేషు ఇచ్ఛారాహిత్యమ్।

ఇహలోకములోని, పరలోకములోని భోగములందు ఇచ్ఛ లేకుండుట.

3. శమదమాదిసాధన సంపత్తిః కాః ? (శమదమాది సాధన సంపత్తియన నేమి?)

శమోదమఉపరస్తితిక్షా శ్రద్ధా సమాధానం చ ఇతి

(శమము,దమము, ఉపరతి,తితీక్ష, శ్రద్ధ,సమాధానము)

అ) శమః కః ? (శమమననేమి?) మనోనిగ్రహః। (శబ్దాది బాహ్య

విషయములనుండి మనస్సును నిరోధించుట)
ఆ) దమః కః ? (దమమననేమి ?)
చక్షురాదిబాహ్యేంద్రియ నిగ్రహః ।(బాహ్యేంద్రియ కర్మేంద్రియములను నియంత్రించుట)
ఇ) ఉపరమః కః ? (ఉపరతి యన నేమి ?)
స్వధర్మానుష్ఠానమేవ. (స్వధర్మమును అనుష్ఠించుట, మనస్సును నిశ్చలం చేసి, అనగా బాహ్య విషయములనుండి మరల్చి బ్రహ్మము నందు నిలుపుట.)
ఈ) తితీక్ష : కాః ? (తితీక్షయననేమి ?)
శీతోష్ణ సుఖదుఃఖాది సహిష్ణుత్వమ్ । (శీతోష్ణములు, సుఖ దుఃఖములను సహించి ఉండుట.)
ఉ) శ్రద్ధా కీ సదృశీ ? (శ్రద్ధయననేమి?) గురువాక్యదిషు విశ్వాసః శ్రద్ధా (గురువాక్యమునందు శ్రద్ధ ఉంచుట. అట్టి శ్రద్ధ వలన ప్రత్యగ్బోద స్వరూపాత్మ లభ్యమయి, "అహం బ్రహ్మేస్మి" అనే నిశ్చయం జ్ఞానం కలుగుతుంది.)
ఊ) సమాధానం కిం ? (సమాధానమననేమి ?)
చిత్తైకాగ్రతా । ఏకాగ్ర లక్ష్యముతో బుద్ధిని నిలుపుట.
ఋ) ముముక్షుత్వం కిం ? మోక్షో మే భూయాద్ ఇతి ఇచ్ఛా ।
(నేను దేహమను అహంకారానిని విడిచి, సద్గురుబోధవలన సంసార బంధమునుండి ముక్తుడగుట)
ఏతద్ సాధన చతుష్ఠయమ్ । (ఇదియే సాధన చతుష్ఠయము.)

సాధకుడైనవాడు ఆ సాధన చతుష్టయమును పొంది, సద్గురువును సమాశ్రయించి, గురూపదిష్ఠ మార్గమున నడిచినచో సంసార బంధమునుండి విడివడి మోక్షస్థితిని పొందగలడు.

# నింద్రకొలను శాఖలో సత్సంగ కార్యక్రమాలు

విశ్వమత ప్రవక్త, సర్వాధిష్ఠాన చైతన్య సమర్థ సద్గురు
శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారి
దివ్య మంగళ మూర్తి ప్రతిష్ఠా ద్వాదశ వార్షికోత్సవము,
మహాకుంభాభిషేకము, యాగము, పంచాహ్నిక సత్సంగ కార్యక్రమాలు
ది. 14-2-16 నుండి 18-2-16 వరకు

**నిత్యకార్యక్రమములు -**

ఉ. 4గం. మేలుకొలుపు, సుప్రభాతం; ఉ. 4-30ని॥ ప్రార్థన;
సా. 6గం. నుండి 8గం. వరకు సంకీర్తన; సత్సంగ సమావేశము.

**విశేష కార్యక్రమములు -**

14-2-16 ఆదివారం; రథసప్తమి
ఉ. 8గం. ఆదిత్య హృదయ ద్వాదశ పారాయణ
ఉ. 9గం. సామూహిక సూర్య ఆరాధన (సామూహిక పూజలు)
ఉ. 11గం. నుండి 1గం. వరకు శ్రీ శ్రీనివాస రామానుజదాసుగారి ప్రవచనం, అనంతరం మహాప్రసాద వితరణ.

15-2-16 సోమవారం, ఉ. 10.గం నుండి 12గం. వరకు శ్రీ శ్రీనివాస రామానుజదాసుగారి ప్రవచనం, అనంతరం మహాప్రసాద వితరణ.
రా. 7గం.లకు శ్రీ సద్గురుదేవుల తెప్పోత్సవము.

16-2-16 మంగళవారం ఉ. 9గం.లకు సామూహిక కుంకుమపూజలు; ఉ.11.గం నుండి మ. 1గం. వరకు శ్రీ శ్రీనివాస రామానుజదాసుగారి ప్రవచనం, అనంతరం మహాప్రసాద వితరణ.

17-2-16 బుధవారం; ఉ. 7గం. అఖండ నామసంకీర్తన (ఏకాహం) ప్రారంభం, ఉ.10.గం నుండి 12గం. వరకు శ్రీ శ్రీనివాస రామానుజదాసు గారి ప్రవచనం, అనంతరం మహాప్రసాద వితరణ.
సా. 4గం. మహాకుంభాభిషేక కార్యక్రమ సంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవాచనము, అంకురార్పణ, మండపారాధనలు, హోమము.

18-2-16 గురువారం; ఉ. 6గం. కుంభాభిషేక కార్యక్రమము; 9గం.లకు మహా కుంభాభిషేకము; 10గం. శ్రీశ్రీనివాసరామానుజదాసు గారి ప్రవచనం; ఉ. 11గం. శ్రీసద్గురుపాదపూజ; మ.12గం.లకు హోమం, పూర్ణాహుతి.

# మేకపిల్ల - తంగేడు పూలు

- శ్రీరామకృష్ణ పరమహంస

వైశాఖమాసంలో ఒక చిన్నమేకపిల్ల తన తల్లివద్ద ఆడుకొంటూ ఉల్లసంగా ఒక గెంతువేసి, తన తల్లితో "అమ్మా! అమ్మా! అవిగో, తంగేడు చెట్లు, వాటి పువ్వులను నేను కడుపారా మేస్తాను" అన్నది.

దానికి తల్లిమేక యిలా అన్నది "బిడ్డా! ఆ పువ్వులను మేయటానికి నీకు అంత సులభం కాదు. తంగేడు పువ్వులు నీ చేతికి చిక్కటానికి ముందు అనేక గండాలు గడపవలసి వున్నాయి. రాబోయే బాద్రపద, ఆశ్వీయుజ మాసాలు నీకు అంతగా శుభదినాలు కావు! ఎవరైనా నిన్ను ఎత్తుకుని పోయి దుర్గాదేవికి బలి యివ్వచ్చు. అది తప్పితే భయానకమైన కాళీపూజ వస్తోంది; అదృష్టం కొద్దీ ఆ గండం కూడా తప్పితే, యింకా జగద్ధాత్రిపూజ ఉంది. ఆ సమయంలో మన జాతిలో మిగిలి వున్న మగ సంతితినంతా దాదాపుగా జాతరలో కడతేరుస్తారు.

మహా అదృష్టవశాత్తు నీవు యీ గండాలన్నీ గడిచి బ్రతికి పెద్ద వాడవైతే దీపావళినాటికి తంగేడు పువ్వుల విందును ఆరగిదవ్దువుగానిలే! అప్పుడు మంచితంగేడు పువ్వులు దొరుకుతాయి కూడా."

ఈ కథలోని మేకపిల్ల మాదిరిగా మన నవయౌవనోత్సాహం కల్పించే మనోరథాలన్నిటికీ తలలు ఊపకూడదు. వాటిని తీర్చుకొందామనే అత్యుత్సాహం కూడదు. మరేమంటే, జీవనయాత్రలో సంభవించే గండాలు అనేకాలని మనస్సులో జ్ఞప్తి ఉంచుకుని గొంతెమ్మ కోరికలను సాధ్యమైనంత వరకు చంపుకోవటమే ఉత్తమం.

# సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## కోటిపల్లి మామ్మగారు

ఇవన్నీ వాళ్ళ నాయకుడు విని, అమీ తుమీ తేల్చుకోవాలని, ఆరోసారి తానే బైరాగి వేషం వేసుకొనిపోయి సంధ్య చీకటి వేళ, 'మాదాకవళం తల్లీ! (భిక్ష) అంటూ వాళ్ళ గుమ్మం వద్ద నుంచుని కేక పెట్టాడు. వాడు తన స్వానుభవం వివరిస్తూ "ఒక మామ్మగారు వచ్చి చూచి, 'తెస్తానుండు' అని లోపలికి వెళ్ళింది. అదే సమయం గదా అని నేను లోపలికి అడుగు పెట్టబోయాను. అప్పుడు హాలులో ఎదురుగా గోడ మీద ఉన్న రెండు ఫోటోలు కనిపించాయి. ఒకటి ఎవరో మహాత్ముడిది. రెండవ దానిలో ఉన్న ఒక భయంకరమైన అమ్మవారి రూపం జడలు విరబోసుకుని, చేతిలో ఉన్న కత్తి ఘళిపించుకుంటూ, నాలుక పెద్దగా జాపి, నా మీదకు అతి వేగంగా దూకింది. హడిలిపోయి నేను బయటకు



దూకి గోదావరి వైపుకి పరుగు లంకించుకున్నాను. కాని ఆ రూపం నన్ను గోదావరి ఒడ్డు మీద కూడా తరుముతూనే వచ్చింది. నాకు తెలివి తప్పి పడిపోయాను. తెలివి వచ్చి చూసేసరికి తెల్లవారిపోయింది. ఆ యింటిని ఏదో శక్తి కాపాడుతున్నదని గ్రహించి ఆ యింటిని వదిలి వేశాము" అన్నాడు.

మామ్మగారూ వారి కుటుంబ సభ్యులందరూ శ్రీ బాబుకు, జగన్మాతకు కృతజ్ఞతతో నమస్కారం చేసుకున్నారు. వాళ్ళ యింట్లో మాత్రం దొంగలు పడకపోవటం ఎందు వల్లనా అని గుబులు పడుతున్న ఆ ఊరి జనానికీ, పోలీసులకూ కూడా అద్భుతాన్ని గొలిపించే యీ సత్యం యీ విధంగా వెల్లడైంది.

1975లో విజయ తొమ్మిది నెలల నిండు గర్భిణిగా ఉన్నది. ఆ సపమయంలో వాళ్ళ అమ్మమ్మ, అమ్మ కూడ శ్రీ బాబు సన్నిధిలో ఉన్నారు. పురిటికి కోటిపల్లి వెడదామంటే వాళ్ళకు శ్రీ బాబు నుండి శెలవు దొరకలేదు. పోతునూరు అక్కయ్యను ఆదేశించారు. "ఒంటరి దానిని" అని ఆమె అంటే, 'శ్రీ బాబు "నేనున్నానులే" అని అభయమిచ్చారు. విజయను ఏలూరులో అన్నపూర్ణమ్మగారి యింట్లో ఉంచి, నొప్పులు వచ్చేటప్పుడు ఆసుపత్రికి తీసుకువెళ్ల వచ్చుననుకున్నారు.

ఈ లోపల మాఘ పూర్ణిమ గురుపూజకు అన్నపూర్ణమ్మ గారు, భర్త నరసింహ మూర్తి గారు ఆశ్రమానికి వెళ్ళి వచ్చారు. శ్రీ గురు పూజా తీర్థము, ప్రసాదము విజయకిచ్చి పోతునూరు అక్కయ్య తీసుకున్నారు. ఆ రాత్రి విజయకు మాత్రం శ్రీ బాబు దర్శనమిచ్చి, విభూతితో రక్ష పెట్టి అభయమిచ్చారు. మరునాడు నొప్పులు వస్తే విజయను ఆసుపత్రిలో చేర్చారు. బిడ్డకు కాళ్లు చుట్టల్లోకి దూరి ముడుచుకుపోయి ఉన్నాయని, ఆపరేషన్ చేసి బయటకు తీశారు. చనిపోయిన బిడ్డ పుట్టిందని చెప్పి డాక్టర్లు వెళ్ళిపోయారు.

శ్రీ బాబు అభయమిచ్చిన తరువాత అలా ఎన్నటికి జరగదనే దృఢ విశ్వాసంతో, పోతునూరు అక్కయ్య మొండి పట్టు పట్టి పిల్లను అవతల పారవేయనీయకుండా, డాక్టర్లకు, నర్సులకు, పారవేయ వచ్చిన పాకీ మనిషి కాళ్లకు అడ్డంపడి, దణ్ణాలు పెట్టి బ్రతిమాలి, "నా గురుదేవుడు తప్పక బ్రతికిస్తార"ని చెప్పి, ఆ పిల్లను బల్ల మీద పడుకోబెట్టించుకుంది. తెల్లవారిన తరువాత శ్రీబాబు కృపా వర్షం కురిసినట్లు, ఆ పాప నెమ్మదిగా బ్రతికి, ఏడ్చింది. డాక్టర్లు , నర్సులు, ఆసుపత్రిలో జనం అందరు, "చనిపోయిన బిడ్డ ఒక రోజు గడిచాక తిరిగి బ్రతకటం కేవలం మీ గురుదేవుల మహిమ" అని, ఎంతో ఆశ్చర్యానందాలతో పోతునూరు అక్కయ్యను ప్రశంసించారు.

మూడు నెలల తరువాత , ఆశ్రమంలో శ్రీ దేవీ శత చండీ యాగము జరిగింది. అప్పటికి ఆశ్రమంలో నివాస వసతులు యింకా ఏర్పడలేదని , పసిపిల్లతో రావద్దనీ ఎవరు చెప్పినా వినకుండా "ఎక్కడా చోటు లేకపోతే, శ్రీ బాబు మంచం క్రింద నాకూ, నా బిడ్డకూ యింత చోటు దొరకక పోదులే" అని అమ్మమ్మ వాళ్ళతో బాటు విజయ, ఆ చంటి పిల్లతో ఆశ్రమానికి వచ్చింది. సరిగా వాళ్ళు ఆశ్రమంలోఅడుగు పెట్టే సమయానికి శ్రీబాబు ఎదురుగా వచ్చి, సూర్య నారాయణ రాజుగారితో" ఈ బాలింతరాలికి, మామిడి చెట్టుక్రిందనే , మంచము, పక్క ఏర్పాటు చేసి, పైన గట్టి దుప్పటితో చాందినీ లాగా కట్టి, బందో బస్తుగా ఏర్పాటు చెయ్యి. నా మంచం క్రింద పడుకుంటే ఎంత సుఖంగా ఉంటుందో అంత సుఖంగా ఉండేటట్లు ఏర్పాటు చెయ్యాలి" అని ఆదేశించారు. భక్తి భరితమైన మనస్సులో కలిగిన భావం, ఆ మనస్సులోనే నివసించే భగవానునికి తెలియదా? చండీయాగ సందర్భంగా , ఆ పాపకు 'లలిత' అని  శ్రీ బాబు నామకరణం చేశారు.

- సశేషం




- రమణ ప్రసాద్

# సూరదాస్

మధురక్షేత్రంలో సూరదాస్ అనే మహాత్ముడు 1478లో జన్మించాడు. అతడు జాత్యంధుడు. ప్రకృతి శోభలను చూచే అదృష్టానికి నోచుకోలేదు. ప్రపంచాన్ని వీక్షించే దృష్టి లేక పోయినా పరమాత్మను దర్శించే జ్ఞాన నేత్రంతో జన్మించాడు.



పువ్వు పుట్టగానే పరిమళాన్ని వెదజల్లుతుంది. అలాగే సూరదాస్‌లో భక్తి కుసుమం అతనిలో పుట్టుకతోనే జనించి భక్తి పరిమళాన్ని వెదజల్లింది. సూరదాస్ లోని ఆధ్యాత్మిక చింతనా సౌరభాన్ని ఆఘ్రాణించే సంస్కారం అతని కుటుంబ సభ్యులకు లోపించింది. గుడ్డివాడని సూరదాస్‌ని అందరూ చులకనగా చూడటం ప్రారంభించారు. అతనిని ఏవగించుకొనేవారు. కుటుంబీకులు చేసే నిందాజ్వాలలకు, సమాజం చేసే అపహాస్యాలకు తలవంచిన సూరదాస్ తనకు భగవంతుడు తప్ప వేరెవ్వరూ శరణ్యం లేరని గ్రహించాడు. ఒకనాడు ఎవ్వరికి చెప్పకుండా బయలుదేరి ఒంటరిగా బయటకు నడిచాడు. అప్పుడతని వయస్సు ఆరేళ్ళు.

తను ఒంటరి వాడెలా అవుతాడు? తన హృదయంలో నందనందనుడు క్షణకాలం కూడా దూరం కాకుండా తిష్ఠవేసి ఉన్నాడు. తనతో భగవానుడు కలిసి నడుస్తూ, నడిపిస్తూన్నప్పుడు తను ఒంటరివాడెలా అవుతాడు? భక్తి భావాలతో ఒంటరి జీవితం గడుపుతూ బలహీనులకు బలము, ధనహీనులకు ధనము, అనాధులకు నాధుడు ఆ పరంధాముడే అని తెలుసుకున్నవాడై గోకులధామం వైపు నడిచాడు. దారిలో ఒక గ్రామ పొలిమేరలో ముందుకు నడవలేక కూర్చుండి పోయాడు.

గ్రామపెద్ద ఒకడు ఆ దారిన వెడుతూ సూరదాస్‌ను చూశాడు.

సూరదాస్ ప్రసన్న వదనం ఆతడిని ఆకర్షించింది. ఆయన సూరదాస్‌ను సమీపించి, “అయ్యా తమరెవరు? ఎక్కడ నుంచి వస్తున్నారు?” అని ప్రశ్నించాడు. “నాయనా! ఎవరు ఎవరో ఎవరికి ఎరుక? అది తెలిసిన వాడొక్కడే. అతని కారుణ్యమే మన మనుగడకు కారణం“ అని జవాబు ఇచ్చాడు. సూరదాస్ పలికిన భావగర్భితమైన మాటలు అతని హృదయాన్ని స్పందింప చేశాయి. భక్తి భావంతో వినయంగా“ మీరు మహానుభావుల వలె ఉన్నారు. మీ నివాస స్థాన మేది? మీరు ఎక్కడ నుండి వచ్చారు? ఎంత వరకు మీ ప్రయాణము? అని ప్రశ్నించారు.

సూరదాస్ నవ్వి “నాయనా! ఎక్కడనుండి వచ్చానని అడుగుతున్నావు? నీవు అడుగుతున్నది ఎవరిని? ఈ పాంచభౌతికమైన శరీరం మలిన పూరితమైన తల్లి గర్భం నుంచి వచ్చింది. నేత్రాలు దారి తప్పి మధ్యలోనే అదృశ్యమైనాయి. మనస్సంటావా? అది మాయ నుంచి వచ్చింది. ఇక నేనంటావా? నేను పుట్టేవాడిని, గిట్టేవాడిని కాను. నా ప్రయాణం ఎంత వరకు? అని కదా నీ ప్రశ్న. అయితే విను. దేనిని తెలుసుకున్న తరువాత ఇంకొకటి తెలుసుకోనవసరంలేదో అట్టి పుణ్యధామాన్ని చేరటానికే నా ప్రయాణం, ప్రయత్నం. సత్యనాధుని పాదములే నా నివాసస్థానము”అని చెప్పాడు.

ఆ గ్రామ పెద్ద మనస్సు చైతన్యవంతమైంది. సూరదాస్ దివ్యవాణితో కనువిప్పు కలిగింది. తన బ్రతుకు బాటకు మార్గగామి లభించినట్లయింది. “అయ్యా! మీలో కనిపించే వైరాగ్యము, మీ ముఖతః వెలువడే భావపరంపరలు, మీలో గోచరించే భక్తి పారవశ్యం నన్ను ఎంతగానో ప్రతిభావంతునిగా చేశాయి. మీకు సేవచేసి, తరించే మహాద్భాగ్యాన్ని నాకు ప్రసాదించండి. మీరు మాగ్రామం లోనే స్థిరపడి మమ్ము కృతార్థులను చేయండి“ అని సూరదాస్ పాదాలపై పడ్డాడు.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL